జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 31 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 146 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: ఏకాదశి - 11:36:40 వరకు నక్షత్రంజ్యేష్ఠ - నిండా రాత్రి వరకు కరణంవిష్టి - 11:36:40 వరకు, బవ - 24:48:56 వరకు పక్షంశుక్ల యోగంబ్రహ్మ - 21:08:49 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

## ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

**అనుకూలమైన విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి**
**ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు**

హైదరాబాద్,జూలై30(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల

మిగతా 2లో..

## గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

**తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్**

హైదరాబాద్,జూలై30(ప్రజాజ్యోతి): గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు.

మిగతా 2లో..

## ఇరాన్‌పై విరుచుకుపడుతున్న
# అమెరికా

- జోర్డాన్, ఈజిప్టులపై దాడులకు ప్రతీకారం
- టెహ్రాన్‌పై, వాషింగ్టన్ వైమానిక దాడులు
- క్షిపణి, బాంబు దాడులతో తీవ్ర దాడులు
- దక్షిణ ఇరాన్ సహా ఖేష్మ్ ద్వీపం ధ్వంసం



వాషింగ్టన్, జూలై30(ప్రజాజ్యోతి): అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ అగ్గి రాజుకుంది. జోర్డాన్, ఈజిప్టులపై దాడులకు ప్రతీకారంగా టెహ్రాన్‌పై, వాషింగ్టన్ వైమానిక దాడులు చేసింది. క్షిపణి, బాంబు దాడులతో దక్షిణ ఇరాన్ సహా ఖేష్మ్ ద్వీపం దద్దరిల్లింది. కుజెస్తాన్ ప్రావిన్స్‌లోని నాలుగు నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ఇరాన్ మీడియా తెలిపింది. అహ్వజ్ నగరంలో ఓ సబ్‌స్టేషన్ ధ్వంసమైందని వెల్లడించింది. గల్ఫ్ ప్రాంతంలోని కిష్ ద్వీపంపై క్షిపణి దాడి జరిగినా ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. పోర్టు నగరం బందర్ అబ్బాస్‌లో క్షిపణి శిథిలాలు పడి మంటలు చెలరేగాయని చెప్పారు.ఖేష్మ్ ద్వీపంలో నివాసం భవనంపై క్షిపణి పడి ముగ్గురు గాయపడ్డారని ఇరాన్ మీడియా పేర్కొంది. జాతీయ విద్యుత్ గ్రిడ్‌పై క్షిపణి దాడులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని వివరించింది. అమెరికా దాడుల అనంతరం ఖేష్మ్ ద్వీపంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు అత్యవసర సిబ్బంది

మిగతా 2లో..

## పశ్చిమాసియా సంక్షోభంపై
# అప్రమత్తం

- ముందస్తు చర్యలు వేగవంతం చేసిన కేంద్రం
- ఇంధన భద్రత, భారతీయుల రక్షణపై చర్యలు
- ప్రధాని మోదీ అధ్యక్షతన సీసీఎస్ సమావేశం!
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- హోల్ ఆఫ్ గవర్నమెంట్ విధానంతో ముందుకు
- భద్రతకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- అధికారులకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన

న్యూఢిల్లీ,జూలై30(ప్రజాజ్యోతి): పార్లమెంట్ హౌస్ సముదాయంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) కీలక సమావేశం జరిగింది . ఈ సమావేశంలో జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. రక్షణ, హోం వ్యవహారాలు, ఆర్థిక, విదేశీ వ్యవహారాల

మిగతా 2లో..



## విద్యార్థులపై కాల్పులు జరిపించింది
# హోంమంత్రే

- ఆర్ఎస్ఎస్ చేతిలో కీలుబొమ్మగా విద్యావ్యవస్థ
- విద్యావ్యవస్థలో అవినీతి బాగా పాతుకుపోయింది!
- జరిగిన 'అరాచకాల'పై కమిటీ ఏర్పాటు చేయాలి
- అమిత్ షాను తన పదవి నుంచి తొలగించాలి
- లోక్‌సభలో రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- పత్రాల లీకేజీపై కేంద్రంపై రాహుల్ గాంధీ దాడి
- ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- రాహుల్ ప్రసంగంపై కిరణ్ రిజిజు అభ్యంతరం
- పార్లమెంట్ ఆవరణలో విపక్ష సభ్యుల నిరసన



న్యూఢిల్లీ,జూలై30(ప్రజాజ్యోతి): పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చ సందర్భంగా, లోక్‌సభలో హాట్ హాట్ చర్చ జరిగింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్‌పై చేసిన కామెంట్స్‌ను అధికార పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన క్షమాపణలు చెప్పి వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దీంతో ఇరు వర్గాల పోటాపోటీ నినాదాలతో సభలో గందరగోళం ఏర్పడింది. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, " కేంద్ర హోం మంత్రి అని పిలిచే ఆయనకు ఇక్కడకు

మిగతా 12లో..



## 2034 వరకు
# నేనే సీఎం..
## ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది

- తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి
- కార్పోరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి
- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న బంధాలు
- మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

**తెలంగాణ విద్యాశాఖలో తెస్తున్న సంస్కరణలు, పాలనాపరమైన నిర్ణయాలపై విపక్షాలు, ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అత్యంత ఘాటుగా, స్పష్టమైన సమాధానం ఇచ్చారు. విదేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన సీఎం, రాష్ట్రంలో పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేరంటూ వ్యాఖ్యానిస్తున్న వారి వ్యాఖ్యలను పూర్తిగా తిరస్కరించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని సమర్థవంతంగా నిర్వహిస్తున్నానని, ఈ శాఖ అత్యంత వేగంగా పురోగతి సాధిస్తున్నందుకే తనను మంత్రి బాధ్యతల నుంచి వైదొలగాలని అడుగుతున్నారా అని సూటిగా ప్రశ్నించారు.**

హైదరాబాద్,జూలై30(ప్రజాజ్యోతి): తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి

మిగతా 2లో..

## తెలంగాణ జిల్లాల్లో
# భారీ వర్షాలు

### పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

**ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు**

- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- బొగత జలపాతం సందర్శన నిలిపివేత
- రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్
- ఆదిలాబాద్, జగిత్యాలకు రెడ్ అలర్ట్ జారీ
- భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి
- జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో సీఎస్



హైదరాబాద్,జూలై30(ప్రజాజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103

మిగతా 2లో..

## రాజ్యసభకు చేరిన ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

- లీకులపై కఠిన చర్యల కోసమే బిల్లు అని చెప్పిన మంత్రి
- విద్యార్థులపై లాఠీఛార్జ్‌పై అమిత్ క్షమాపణలు చెప్పాలన్న ఖర్గే
- వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం
- లోక్‌సభలో ఆమోదం పొందిన వందేమాతరం బిల్లు

న్యూఢిల్లీ,జూలై30(ప్రజాజ్యోతి): ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026' రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని సభలో ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఏమాత్రం సహించే

మిగతా 12లో..

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
కాక్రోచ్ చీఫ్ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే హెచ్చరిక

పుణె,జూలై30(ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే

మిగతా 12లో..

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ

హైదరాబాద్,జూలై30(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి

మిగతా 2లో..

## ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకాయిల చెల్లింపులు

తాజాగా మరో రూ. 2 వేల కోట్లు విడుదల చేసిన ఆర్థిక శాఖ

హైదరాబాద్,జూలై30(ప్రజాజ్యోతి): ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు,

మిగతా 2లో..

## నందిపంప్ హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

పెద్దపల్లి,జూలై30(ప్రజాజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్ -2 ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి ఇక్కడి పంపు హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల ప్రక్రియ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. గురువారం కూడా నీటి ఎత్తిపోతలు కొనసాగాయి. 1,4,5,6 మోటార్ల ద్వారా నీటిని

మిగతా 2లో..

# సంపాదకీయం

## ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్థలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచివేతకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

# 2034 వరకు నేనే సీఎం..

మొదటిపేజీ తరువాయి..

రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణేళి మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయులు అడగకపోయినా 2024 జనవరి నుంచి ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా సమయానికి వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం పెంచామని వివరించారు. అమెరికాపైనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల వైపు దృష్టి సారించాలని, భాష అనేది కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇకపోతే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి..

విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మూడు విడతల్లో ఒక్కోసారి రూ.2,000 కోట్ల చొప్పున మొత్తం రూ.6,000 కోట్లను విడుదల చేసింది. దీంతో పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల కమ్యూటేషన్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకాయిలను విడుదల చేస్తామన్న మాటను తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుంది.

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

మొదటిపేజీ తరువాయి..

ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷-రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, కూడా పాల్గొన్నారు.

## తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి..

టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగు తుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు, పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది. జలపాతం ముందు ఉన్న సెల్ఫీ వ్యూ పాయింట్‌పై నుంచి స్విమ్మింగ్ పూల్ మీదుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో బొగత సందర్శనకు అటవీశాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి అనుమతి నిలిపివేశారు.

## నందిపంప్ హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

మొదటిపేజీ తరువాయి..

పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసి నంది రిజర్వాయర్ లోకి ఎత్తిపోస్తున్నారు. అనంతరం అదే పరిమాణంలో నంది రిజర్వాయర్ క్రష్ గేట్ల ద్వారా జలాలు ఏడో ప్యాకేజీ జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ లోకి వెళుతుంది.

## ఇరాన్‌పై విరుచుకుపడుతున్న అమెరికా

మొదటిపేజీ తరువాయి..

సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపింది. హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్ సంక్షోభ నిర్వహణ విభాగం డైరెక్టర్ జనరల్ తెలిపిన వివరాల ప్రకారం, శిథిలాల కింద నుంచి ఇద్దరు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసి సమీప వైద్య కేంద్రాలకు తరలించారు. అదే ఇంటిలో ఉన్న మరో ముగ్గురు కుటుంబ సభ్యులను రక్షించేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. దాడి జరిగిన సమయంలో ఆ ఇంట్లో ఐదుగురు సభ్యులతో కూడిన కుటుంబం ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఖుజెస్తాన్ ప్రావిన్స్‌లోని షాడెగాన్, అర్వంద్‌కెనార్, అబాదాన్, అహ్వాజ్ నగరాల్లో వరుస పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. ముఖ్యంగా అహ్వాజ్ నగరంలోని ఏడు ప్రాంతాలకు పైగా ఈ శబ్దాలు వినిపించినట్లు పేర్కొంది. అలాగే బందర్ అబ్బాస్‌లో రెండు పేలుళ్ల శబ్దాలు వినిపించగా, అవి నగర శివార్ల ప్రాంతాల నుంచి వచ్చినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడించింది. బుషెహర్ ప్రావిన్స్‌లో పేలుళ్లు సంభవించినట్లు తెలిపింది. ఈ ప్రావిన్స్‌లోనే ఇరాన్ అణువిద్యుత్ కేంద్రం ఉంది. అయితే ఆ కేంద్రంపై దాడి జరిగింతో లేదో స్పష్టతలేదు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు చెందిన స్థావరాలపై దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్‌లో పోస్ట్‌లో తెలిపింది. మిలిటరీ కమాండ్ సెంటర్లు, క్షిపణి, డ్రోన్ కేంద్రాలతో పాటు తీరప్రాంత నిఘా, రక్షణ స్థావరాలను ధ్వంసం చేసినట్లు వివరించింది. అటు అమెరికా దాడులకు గట్టిగా బదులిస్తామని ఇరాన్ హెచ్చరించింది.

## పశ్చిమాసియా సంక్షోభంపై అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి..

మంత్రిత్వ శాఖల కీలక మంత్రులతోపాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. ముగ్గురు కేంద్ర మంత్రులను కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించారు. ముఖ్యంగా పశ్చిమాసియా ఘర్షణలు, ఎర్ర సముద్రం, హర్మూజ్ జలసంధి, గల్ఫ్ ఆఫ్ ఏడెన్, బ్లాక్ సీ ప్రాంతాల్లో నెలకొన్న భద్రతా సమస్యలు భారత దిగుమతులు, సరఫరా వ్యవస్థపై చూపుతున్న ప్రభావాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరా అంతరాయం లేకుండా కేంద్రం చేపట్టిన చర్యలను కూడా వివరించారు. ప్రస్తుతం దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు, సరఫరా పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని సమావేశంలో వెల్లడించారు. ముడి చమురు లభ్యత సమృద్ధిగా ఉండటంతో ప్రభుత్వ రంగ రిఫైనరీలు 100 శాతానికి పైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దీంతో పెట్రోల్, డీజిల్ తదితర ఇంధన ఉత్పత్తుల తయారీ నిరంతరాయంగా కొనసాగుతోందని వివరించారు. ఎల్‌పీజీ సరఫరాపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒకే దేశంపై ఆధారపడకుండా ఎల్‌పీజీ కొనుగోలు వనరులను ఇప్పటికే విస్తరించినట్లు అధికారులు తెలిపారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా పైప్‌డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్ల విస్తరణకు చర్యలు చేపట్టడంతో గ్యాస్ వినియోగం పెరుగుతోందని వెల్లడించారు. జాతీయ గ్యాస్ గ్రిడ్ విస్తరణ, ఎల్ఎన్‌జీ దిగుమతుల సామర్థ్య పెంపు, సిటీ గ్యాస్ పంపిణీ వ్యవస్థ విస్తరణ, పైప్‌లైన్ మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి వంటి చర్యల ద్వారా ఎల్‌పీజీపై ఆధారాన్ని క్రమంగా తగ్గించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని సమావేశంలో చర్చించారు.

## ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి..

పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ుాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

మొదటిపేజీ తరువాయి..

వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణెళిశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణెళిశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు.


తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (LA) విభాగం

కలెక్టరేట్: మహబూబ్‌నగర్

ఫారం - VII,

రూఢీ ప్రకటన

(2013 యొక్క చట్టం-30 యొక్క 19(1) సెక్షన్ మరియు నిబంధన-25 యొక్క ఉప నిబంధన(1) చూడండి)

No. Rev/G1/LAG/0004/2026-G-Section తేది: 16.07.2026

ఇది ఇలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం/కలక్టర్ వారి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం యొక్క కొత్తూరు గ్రామంలోని ఎక.0.14 గుంటలు మొత్తం విస్తీర్ణం, ప్రజా ప్రయోజనం నిమిత్తం మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం క్రింద డిస్ట్రిబ్యూటర్ 50 కెనాల్ త్రవ్వకానికి ఆ భూమి అవసరమైందని భావించారు.

కాబట్టి మహబూబ్‌నగర్ జిల్లా యొక్క మిడ్జిల్ మండలం కొత్తూరు-గ్రామంలో పై సదరు ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద ప్రామాణిక కొలత యొక్క ఎక.0.14 గుంటలు ఎక్కువ లేదా తక్కువగా భూమి కొలతకు రూఢీ ప్రకటన చేయబడింది. దాని సవివర వివరణ ఈ క్రింది విధంగా:

గ్రామం : కొత్తూరు మండలం : మిడ్జిల్ జిల్లా : మహబూబ్‌నగర్

| క్ర. సం. | సర్వే నెం. | మెట్ట/ ఐ.డి/ తరి | భూమి రకం | సేకరణక్రింద ప్రతిపాదిత ఏరియా (ఎ.లలో) ఎక.గుం. | ఆస్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | కట్టడాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 122 | మెట్ట | పట్టా | 0.14 | బుజూరు సుగుణమ్మ భర్త: లేట్ బుజూరు రాంరెడ్డి | - | - | - | - | - | - |
| | | | | | బుజూరు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి : లేట్ బుజూరు రాంరెడ్డి | | | | | | |
| | | | | | బుజూరు ధర్మారెడ్డి తండ్రి: లేట్ బుజూరు రాంరెడ్డి | | | | | | |
| | | | | | బుజూరు రాజేందర్‌రెడ్డి తండ్రి: లేట్ బుజూరు రాంరెడ్డి | | | | | | |
| | | | | | బుజూరు నరేందర్‌రెడ్డి తండ్రి: లేట్ బుజూరు రాంరెడ్డి | | | | | | |
| | | మొత్తం : | | 0.14 | | | | | | | |

2013 నాటి చట్టం నం. 30లోని సెక్షన్ 15 ప్రకారం, సంబంధిత వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ జరిపిన తర్వాత ఈ ప్రకటన చేయబడింది. భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలకూ పునరావాసం కల్పించాల్సిన అవసరం లేదు.

భూసేకరణ చేపట్టబడిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనియెడల స్వీకరించబడవు.

ఈ భూమికి సంబంధించిన ప్లాన్‌ను మహబూబ్‌నగర్‌లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R, యూనిట్-II, నీటిపారుదల ప్రాజెక్ట్ కార్యాలయంలో ఏ పని దినంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R యూనిట్-II ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, మహబూబ్‌నగర్

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్

సం/-. కుమ్మగుప్తా IAS జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్

DIPR RO.NO: 548/LA/PP/Advt/Pub/2026-27



CHANGE OF NAME

I, **SAWAPURE PRANEETH S/O SAWAPURE VIJAY KUMAR** (Old Name) born on 04-03-1995 at sawapur earlier was holding passport no. **N5994389** DT: 18-12-2015 hereby changing my name and henceforth in future I would be known as SAWAPURE PRANEETH KUMAR S/O SAWAPURE VIJAY KUMAR (New name) HNo. 2-54 SAWAPUR, Dist. Adilabad 504309 Telangana.

**DECLARANT.**
**PRANEETH KUMAR**
**S/O SAWAPURE VIJAY KUMAR**

**Place: SAWAPURE**
**Date: 16-06-2026**

# బాధిత కుటుంబానికి అండగా మంత్రి వివేక్ వెంకటస్వామి

- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశం
- ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఎంబరి సజన్ కుమార్‌కు బాధ్యత





**మంచిర్యాల, 30, జులై (ప్రజా జ్యోతి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అలుగామ గ్రామానికి చెందిన ఆత్రం మంతయ్య కుటుంబం తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇల్లు కూలిపోవడంతో ఆత్రం మంతయ్య, ఆయన భార్య లక్ష్మి, కుమారులు అజయ్, అనిల్ గాయపడ్డారు. ప్రస్తుతం వారు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే నిరుపేద కుటుంబానికి కొత్త ఇల్లు నిర్మించి అందజేయాలని కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎంబరి సజన్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. మంత్రి ఆదేశాలకు స్పందించిన ఎంబరి సజన్ కుమార్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి త్వరితగతిన ఇల్లు నిర్మించి అందజేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలిచే ప్రభుత్వమని, మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని తెలిపారు .అలాగే ఇటీవల భారీ వర్షాల కారణంగా ఇల్లు కూలిపోయిన జాడి లింగయ్య కుటుంబానికి కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు .. తాత్కాలిక బ్రిడ్జి తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు కీలక సూచనలు
- అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి



**మంచిర్యాల, 30, జులై (ప్రజాజ్యోతి) :** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని హెచ్చరించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువులు, డ్యామ్‌లు, జలపాతాల వద్దకు వెళ్లకూడదని, చేపల వేట కోసం కూడా వెళ్లరాదని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదని సూచించారు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీటమునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా బ్యారికేడ్లు, ప్లాస్టిక్ కోన్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు, అలుగులు, ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు . చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని, రహదారులపై నీరు నిల్వ ఉండడం, గుంతలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు. కల్వర్టులు, చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని, పోలీసు సిబ్బంది 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటారని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



**బాసర జూలై 30 (ప్రజా జ్యోతి) :** ముధోల్ మండలంలోని గన్నోర గ్రామంలో మరియు బాసర మండలంలోని కౌట గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# గంగా, చంద్ర, కల్పవృక్ష పుణ్యాల కలయికే గురువు కటాక్షం

- గురు పౌర్ణమి పూజోత్సవం ఉభయ వేదాంత పండితాచార్యులు ఆలయ పురోహితులుచక్రపాణి పద్మ వాసుదేవా చారి దంపతు లకు పౌరసన్మానం
- కోటిజన్మ పుణ్యఫలం గురుపూజ వేద పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ









**ఖానాపూర్ జూలై 30 (ప్రజా జ్యోతి) :** గంగా స్నానం చందమామ వెలుగు కల్ప వృక్షాల పుణ్యఫలమే గురువు కటాక్షమని వేద పండితులునిమ్మగడ్డ సందీప్ శర్మ అన్నారు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పవిత్ర ఉత్తరవాహిని గౌతమి నది తీర ప్రాంతమైన శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఉభయ వేదాంత పండితారాధ్యులు ఏడు దశాబ్దాలుగా భగవత్ ఆరాధన తో పాటు పురోహితులుగా హరికథ పితామహులుగా సంగీత కళాకారులుగా ఈ ప్రాంత ప్రజల హృదయాలను దోచుకున్న శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పురోహితులు చక్రపాణి వాసుదేవ చార్యు లకు బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు నిమ్మగడ్డ సందీప్ శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న కమిటీ సభ్యులతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ సారథ్యంలో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా పురోహిత దంపతులు చక్రపాణి పద్మ వాసుదేవా చారి పాదపూజతోపాటు ఘనంగా పౌర సన్మానం పార్టీల అతీతంగా వివిధ ప్రజా ప్రతినిధులు వ్యాపార సంఘాలతో పాటు పట్టణ భక్తజనులు ఘనంగా దంపతులకు పాదప్రక్షాళన చేసి యధాశక్తిగా శాలువాలతో నిండు వస్త్రాలతో కట్న కానుకలు అందించి గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వర అన్న భావనతో ఆశీర్వాదాలు తీసుకున్నారు ఆధ్యాత్మిక భావనను నింపి అనేక నూతన దేవాలయాల ప్రతిష్టలు చేసి పుణ్యఫలం పొందిన వాసుదేవా చారి కను సన్నలలో 13 సంవత్సరాల బాల్యం నుండి వారి ఆధ్యాత్మిక విద్యా బోధనలతో వేద బ్రాహ్మణునిగా అంచలంచలుగా ఎదిగిన ఘనత పండితులు వాసుదేవా చారి తాతగారిదేనని గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అధ్యక్షులు ప్రసన్నాంజనేయ దేవాలయ అర్చకులు నిమ్మగడ్డ సందీప్ శర్మ తన ప్రసంగంలో కొనియాడారు ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డకట్ల రాజన్న మాట్లాడుతూ తన చిన్ననాటి నుండి గురుతుల్యులు అయ్యగారు వాసుదేవా చారి తో పాటు వారి కుమారులు వేద పండితులు డాక్టర్ చక్రపాణి నరసింహమూర్తి సైతం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో అర్చకులుగా పండితులుగా అనేక కార్యక్రమాలు చేసి ఈ ప్రాంతాన్ని భక్తి భావం లో నింపడం ఈ గ్రామ అదృష్టంగా భావిస్తున్నట్లు కొనియాడారు ఆధ్యాత్మిక ఆలయాలపై మక్కువ మొదటినుండి కలిగిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అర్చకులుగా పనిచేస్తూ తన వివాహాన్ని సైతం తన చేతుల మీదుగా చేసి తన ఆశీర్వాదంతో తమ కుటుంబం అనేక రకాలుగా ఆర్థికంగా సామాజికంగా రాజకీయపరంగా ఎదుగుదల వారి చలివేనని వారి ఆశీర్వాదాలేనని నెమ రేసుకున్నారు గోదా కృష్ణ ఆలయ పురోహితులు వద్దిపర్తి రమణాచార్యులు మాట్లాడుతూ ఆచారి ఆధ్యాత్మిక సేవలు అమోఘం అన్నారు సీనియర్ వైద్యులు డాక్టర్ అనిల్ బాబు మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలో దేవాలయ నిర్మాణం చేసి 45 సంవత్సరాలు కాలం నుండి నేటి వరకు నిర్విరామంగా వాసు దేవా చారి అర్చలకులుగా నేటికీ ఉత్సాహంతో పూజలు చేస్తూ అనేక మంది భక్తులను ఈ ప్రాంతంలో తయారుచేసి ఆధ్యాత్మిక బోధనలను పెంపొందించిన వ్యక్తి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డాకట్ల రాజన్న మాజీ మార్కెట్ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజుర సత్యం అంకం రాజేందర్ కౌన్సిలర్లు నిమ్మల రమేష్ సత్యవతి నాయకులు గొర్రె గంగాధర్ మేష సతీష్ చాత్రాద శ్రీ వైష్ణవ సంఘ అధ్యక్షులు మంత్ర రాజాం దేవేందర్ విడిసి అధ్యక్షులు బిసి రాజన్న కడార్ల గంగ నరసయ్య అయ్యప్ప గురు స్వామి పిస్పాటి పాపారావు వివిధ ఆలయాలు అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నో జన్మల పుణ్యఫలం - నాన్నపౌర సన్మానం

- మా కుటుంబానికి దక్కింది - ప్రజలకు రుణపడి ఉన్నాం - వేద పండితులు చక్రపాణి నరసింహా మూర్తి వెల్లడి







**ఖానాపూర్ జూలై 30 (ప్రజా జ్యోతి) :** పవిత్ర గురు పౌర్ణమి వ్యాస పౌర్ణమి సందర్భంగా వేద పండితులు చక్రపాణి పద్మ వాసుదేవా చారి దంపతులకు ఆలయ కమిటీ తో పాటు పట్టణ ప్రజలు చేసిన సన్మాన సత్కారాలు జన్మజన్మలకు మర్చిపోని విధంగా ఈ ప్రజానీకానికి రుణపడి ఉంటామని ఆలయ పురహితులు వాసుదేవ చారుల పుత్రులు చక్రపాణి నరసింహమూర్తి అన్నారు సన్మానం సందర్భంగా సన్మాన గ్రహీత పుత్రికలు శ్రీదేవి సుమతి తమ ప్రసంగాల్లో తమ కుటుంబాన్ని ఆదరించిన పుర ప్రముఖులను పేరుపేరునా తలుచుకొని ఎన్నో జన్మల పుణ్యఫలమే ఈ అవకాశంగా భావిస్తున్నామని అన్నారు ఖానాపూర్ పట్టణ మున్సిపల్ పాలకవర్గం, చైర్ పర్సన్ అంకం మౌనిక మహేందర్ దంపతులతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల రత్నకుమారి నారాయణ దంపతులు మున్సిపల్ చైర్మన్ పదకొండవ వార్డు కౌన్సిలర్ రాజురా సత్యం కౌన్సిలర్ నిమ్మల రమేష్ దంపతులు కౌన్సిలర్ నాయకులు సత్యవతి

గొర్రె గంగాధర్ మేష సతీష్ తిమ్మాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బిసి రాజన్న డాక్టర్ విజయ్ కుమార్ కడార్ల గంగ నరసయ్య మాజీ ఆలయ కమిటీ అధ్యక్షులు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జలంధర్ జితేందర్ అవ్వ బుచ్చన్న పడగల అశోక్ బండారి విశ్వనాథం హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజ్యం కవితా సురేష్ రమా రామకృష్ణ,శిరీష డాక్టర్ రామ్ ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి లక్ష్మణ్ తోట హనుమంతు నడిమెట్ల రమేష్ భీమన్న గోదా కృష్ణ ఆలయ పురోహితులు వద్దిపర్తి రమణాచార్యులు మంత్రరాజ్యం శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్టు రాచమల్ల రాజశేఖర్ వెన్నం అంజయ్య చింతపండు సత్తయ్య పెంబి

**రామేశ్వర్ రెడ్డి భక్త మండలి :** చాత్రాద శ్రీ వైష్ణవ సంఘ అధ్యక్షులు మంత్రరాజం దేవేందర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతామణి శ్రీనివాస కృష్ణ పనింద్ర ఉపేంద్ర (చిన్నోడు పెద్దోడు) మహిళ భక్త మండలి తోపాటు పద్మావతి నగర్ యువజన సంఘ సభ్యులు పాల్గొనగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ తరఫున నిర్వహించారు ఇందులో సన్మాన గ్రహీత గురుతుల్యులు పద్మ వాసుదేవా చారిల కుటుంబ సభ్యులు వివిధ ఆలయాల అర్చకులు పండితులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల్లో సైతం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల







**ఖానాపూర్ జూలై 30 (ప్రజా జ్యోతి) :** జిల్లాలో రెండు రోజులుగా రాత్రులు నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గొడుగు పట్టుకొని గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాబోయే రెండు రోజుల పాటు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే కడెం ప్రాజెక్టు, ఇతర వాగులు, వంకలు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు, మత్స్యకారులు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు.

ఖానాపూర్ కడెం మండలాల్లోని గ్రామాలు, పట్టణాల్లో పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆపత్కాల పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ పీడీ విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కడెం మండల తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈ, కడెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ కటకం సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక బ్రిడ్జి తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే మరమ్మతులు చేపడతాం
- కార్పొరేటర్ సుధమల హరికృష్ణ

**మంచిర్యాల, 30, జులై (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని కాకతీయ కాలనీ--వినూతన కాలనీకి వెళ్లే మార్గమధ్యలో ఉన్న తాత్కాలిక బ్రిడ్జి రోడ్డు గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గురై గురువారం ఉదయం మధ్య భాగంలో తెగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక కార్పొరేటర్ సుధమల హరికృష్ణ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వర్షం తగ్గిన వెంటనే తాత్కాలిక బ్రిడ్జికి మరమ్మతులు చేపడతామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి తక్షణమే తాత్కాలిక బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభించాలని సూచించినట్లు కార్పొరేటర్ తెలిపారు. అలాగే ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు తెలియజేయగా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వీలైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణం/మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు కార్పొరేటర్ సుధమల హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



# వరద ప్రాంతాల సందర్శన

లో భహంగా భారీ వర్షాలకు తెగిపోయిన రెంకొని వాగు తాత్కాలిక వంతెనను పరిశీలించినజిల్లా ఎస్పీ జానకి షర్మిల



**ఖానాపూర్ జులై 30 (ప్రజాజ్యోతి) :** ఖానాపూర్ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలను జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల గురువారం ఉదయం వర్షంలో సైతం సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వరద ఉధృతికి తెగిపోయిన రెంకొని వాగు తాత్కాలిక వంతెనను పరిశీలించి, సంబంధిత అధికారులతో పరిస్థితిపై సమీక్షించారు. హైటెక్ సిటీ సమీపంలోని వాగుకు అవతల ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ (TMREIS) విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. అలాగే వరద ప్రవాహం ఉన్న వాగులు, చెరువుల్లోకి వెళ్లడం, ఈత కొట్టడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.ఎస్పీ వెంట ఖానాపూర్ సి.ఐ.కటకం సత్యనారాయణ, ఎస్.ఐ. రాహుల్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, న్యాయవాది షబ్బీర్ పాష తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత వర్ష పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





**మంచిర్యాల, 30, జులై (ప్రజా జ్యోతి) :** రాష్ట్రంలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. గురువారం మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటి గోడ కూలిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ. భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ఆర్ఎంఓలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీధర్, కోటపల్లి మండల తహసీల్దార్ రాఘవేంద్రతో కలిసి మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కోటపల్లి మండలం ఆలుగాం గ్రామానికి చెందిన ఆత్రం మాంతయ్య ఇంటి గోడ కూలిపోవడంతో ఆత్రం లక్ష్మికి తలకు, ఆత్రం అనిల్‌కు చేతికి గాయాలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం వారు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు . బాధిత కుటుంబానికి ఇప్పటికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని, ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వర్షాల కారణంగా ఏర్పడే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలను అప్రమత్తం చేశామన్నారు . చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీలు మరియు సంబంధిత అధికారులకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# డబుల్ బెడ్‌రూం కాలనీలకు మౌలిక వసతులు

## - సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి): డబుల్ బెడ్‌రూం గృహాల కాలనీల్లో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, వారి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం మదనాపూర్ డబుల్ బెడ్‌రూం గృహాల కాలనీని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



కాలనీలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్యను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యటనలో హౌసింగ్ పీడీ విటోభా, వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచ్, కాలనీ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# 14 ఏళ్ల బాలికలకు హెచ్ పి వి టీకాలు వేగవంతం

గద్వాల్,జూలై 30(ప్రజా జ్యోతి ప్రతినిధి): జిల్లాలో 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాల కార్యక్రమాన్ని వేగవంతంగా చేపడుతున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మహమ్మద్ అస్గర్ అలీ తెలిపారు.భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఈ టీకా ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.డీఎంహెచ్‌వో డా.సంధ్య కిరణ్మై ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రాక్టీసింగ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రభుత్వ బాలబాలికల ఉన్నత పాఠశాల,మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,ధరూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర టీకాల తనిఖీ బృందం సభ్యులు డేవిడ్ దమార, డా.పృథ్వీరాజ్ సందర్శించి పరిశీలించారు.జిల్లాలో మొత్తం 7,676 మంది అర్హులైన బాలికలు ఉండగా,ఇప్పటివరకు 4,197 మందికి టీకాలు అందించినట్లు





అస్గర్ అలీ తెలిపారు.మిగిలిన వారందరికీ నిర్ణీత గడువులోపు టీకాలు పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు, సంబంధిత వైద్యాధికారులు,ఇన్‌చార్జి డీఈఎంఓ హిరియా నాయక్, ఎస్ఓ తిరుమల్ రెడ్డి,డీవీఎల్ఎం నరేందర్ బాబు,డీపీహెచ్ఎన్ఓ వరలక్ష్మి ,వీసీసీఎం శ్రీలక్ష్మి ,పర్యవేక్షణ సిబ్బంది,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పనుల్లో రాజకీయాలకు తావులేదు!

## - ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

వనపర్తి, జూలై 30 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలు, పార్టీ భేదాలకు ఏమాత్రం తావులేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేసే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. గురువారం వనపర్తి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, రైతులకు ఎరువులు, విత్తనాలు, పశువైద్య వ్యాక్సిన్లు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం, మధ్యాహ్న భోజనంలో నాణ్యత, హాస్టళ్లలో మెరుగైన వసతి, అదనపు తరగతి గదుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మట్టి, ఇసుక సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఎంజే–4 ప్రాజెక్టు భూ నిర్వాసిత రైతులకు నష్టపరిహారం త్వరగా అందించాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇకపై ప్రతి 45 రోజులకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, సమావేశ అజెండాను 15 రోజుల ముందుగానే సభ్యులకు అందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధర్మమని, బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.





# డ్రగ్స్ రహిత మహబూబ్‌నగర్ కోసం సమష్టి కృషి అవసరం : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, జూలై 30( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి పాలమూరు యూనివర్సిటీ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల ప్రతినిధులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పోలీసు, ఎక్సైజ్, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన నార్కోటిక్స్ అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అధికారులకు తెలియజేయాలని, ఇందుకోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్‌ను త్వరలో ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, సమాచారం అందించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, హాస్టళ్లలో డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. తరగతి గదులు, హాస్టల్ ప్రవేశ ద్వారాలు, సమావేశ ప్రాంగణాలు, పరిపాలనా భవనాలు, తల్లిదండ్రులు వచ్చే ప్రాంతాల్లో పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రోజుల్లో పోస్టర్ నమూనాను అందజేస్తామని, అన్ని విద్యాసంస్థలు దానిని అమలు చేయాలని చెప్పారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగ లక్షణాలను గుర్తించేలా అధ్యాపకులు, వార్డెన్లు, భద్రతా సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే హాస్టళ్లలోకి తీసుకువచ్చే బ్యాగులను తనిఖీ చేయడం, రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని చెప్పారు. మద్యం సేవించడం చాలా సందర్భాల్లో మాదకద్రవ్యాల వినియోగానికి తొలి మెట్టుగా మారుతుందని, అందువల్ల మద్యం వినియోగ నియంత్రణపైనా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు సమాచారం అందితే సంబంధిత వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే డీ–అడిక్షన్ కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే యువతను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం సాధ్యమవుతుందని చెప్పారు. డ్రగ్స్ నియంత్రణ పోలీసు శాఖ ఒక్కదాని బాధ్యత కాదని, ప్రతి పౌరుడు సమాచారాన్ని అందించడం ద్వారా భాగస్వామి కావాలని కోరారు. "డ్రగ్ ఫ్రీ మహబూబ్‌నగర్" లక్ష్య సాధనకు అందరి సహకారం అవసరమని అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి డి. ఇందిర మాట్లాడుతూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అమలు చేస్తున్న డ్రగ్ అవేర్‌నెస్ అండ్ వెల్‌నెస్ నావిగేషన్ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగించినట్లు గుర్తించిన విద్యార్థులపై వెంటనే శిక్షాత్మక చర్యలకు వెళ్లకుండా, ముందుగా కౌన్సెలింగ్, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం, అవసరమైతే డీ–అడిక్షన్ కేంద్రాలకు తరలించడం వంటి పునరావాస చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. పోలీసు శాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, పారాలీగల్ వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తే యువతను డ్రగ్స్ బారినుంచి కాపాడవచ్చని అన్నారు. సమావేశంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ విద్యాసంస్థల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై తరచూ అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల ప్రతినిధులు, పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# 23 కోట్లతో పాలిటెక్నిక్ పనులు ప్రారంభం

- నిధుల మంజూరు అఖిలపక్ష పోరాట ఫలితమే
- పాలిటెక్నిక్ భవన పనులు వేగవంతం చేయాలి
- రాజా బంగ్లా మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని సతీష్ డా. యాదవ్ డిమాండ్

వనపర్తి, జూలై 30 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ.23 కోట్ల



నిధులు మంజూరు కావడంలో కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, పాలకులు, అధికారులు, ఉద్యమంలో భాగస్వాములైన నాయకులకు అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అఖిలపక్ష ఐక్యవేదిక పోరాట ఫలితంగానే ఈ నిధులు మంజూరై భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని ఆయన పేర్కొన్నారు. గురువారం అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన పాలిటెక్నిక్ ప్రధాన భవనం (రాజప్రసాదం) సమస్యపై అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించి, అప్పటి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను కలిసి



వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. తమ వినతులు, సిఫార్సుల మేరకు రూ.23 కోట్ల నిధులకు ఆమోదం లభించిందన్నారు. నిధులు మంజూరైన తర్వాత కూడా పనులు ఆలస్యం కావడంతో మరోసారి పోరాటం చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చేశామని తెలిపారు. ప్రస్తుతం నూతన విద్యా భవనం పై అంతస్తులు, వెనుక భాగంలో నిర్మిస్తున్న హాస్టల్ భవనాల పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరినట్లు చెప్పారు. అయితే శిథిలావస్థలో ఉన్న రాజప్రసాదం (రాజా బంగ్లా) భవనం మరమ్మతు పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రాజా బంగ్లా మరమ్మతు పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు కొత్తగొల్ల శంకర్, బీఎస్పీ నాయకుడు మైబూస్, లోక్‌సత్తా నాయకుడు రాజ్‌కుమార్, బీజేపీ నాయకులు రవి, రామస్వామి, శివకుమార్, చంద్రశేఖర్, సూర్య నాయక్, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

# 2025-26 సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలి : సివిల్ సప్లైస్ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

మహబూబ్‌నగర్, జూలై 30( ప్రజా జ్యోతి బ్యూరో ): 2025–26 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) డెలివరీలను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన ఆయన భూత్పూర్ మండలంలోని భాను పార్బాయిల్డ్ రైస్ మిల్, తాటికొండలోని నరహరి పార్బాయిల్డ్ రైస్ మిల్లను సందర్శించి మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం నిల్వలు, సీఎంఆర్ సరఫరా పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లర్లతో మాట్లాడిన డైరెక్టర్, మిల్లింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన జిల్లా పౌర సరఫరాల అధికారులు (డీసీఎస్‌వోలు), జిల్లా మేనేజర్లు (డీఎంలు), ఎఫ్‌సీఐ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2025–26 ఖరీఫ్, రబీ సీజన్ సీఎంఆర్ డెలివరీలపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న డెలివరీలను తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు, రైస్ మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత





గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు పురోగతిని పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌వో) గంప శ్రీనివాస్, ఎఫ్‌సీఐ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## విదేశీ విద్యా పర్యటనకు ఆగస్టు 7 వరకు నామినేషన్లు

గద్వాల్,జూలై 30(ప్రజా జ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం టీచర్స్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం–ఫేజ్–2ను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కింద ఫిన్లాండ్, సింగపూర్,జపాన్,వియత్నాం,చైనా దేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 190 మంది ఉత్తమ ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులను పంపించనున్నట్లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఇద్దరు ప్రధానోపాధ్యాయులు,ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు/పీజీటీలు,ఇద్దరు ఎస్జీటీలు/టీజీటీలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపనున్నట్లు విచారణలు,చార్జిషీట్లు లేదా క్రిమినల్ కేసులు లేకపోవడంతో పాటు విదేశీ పర్యటనకు అనుకూలమైన ఆరోగ్య పరిస్థితి ఉండాలని వివరించారు.గత మూడేళ్ల పనితీరు, విద్యార్థుల అభ్యాస ఫలితాలు,ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ,పాఠశాల నమోదు పెంపు,డ్రాప్‌అవుట్ల తగ్గింపు,వినూత్న బోధన,డిజిటల్ సాంకేతికత వినియోగం,కమ్యూనిటీ





భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు.హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఫిన్లాండ్,జర్మనీ దేశాల్లో విద్యా వ్యవస్థను అధ్యయనం చేసి వచ్చిన బృందంతో నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.జిల్లా నుంచి డీఈవో విజయలక్ష్మి ,సెక్టోరియల్ అధికారి మైఖేల్,ఉపాధ్యాయుడు అగస్టీన్ హాజరయ్యారు.అనంతరం కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో,ఫేజ్–2 చెప్పారు.ఎంపికలో ఇద్దరు పురుషులు,నలుగురు మహిళలకు అవకాశం కల్పించడంతో పాటు ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉంటుందన్నారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అదనపు కలెక్టర్,జిల్లా విద్యాశాఖ అధికారి, మరో నామినేటెడ్ అధికారితో కూడిన కమిటీ దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుందని తెలిపారు.అభ్యర్థులు 2026 ఆగస్టు 1 నాటికి 55 ఏళ్లలోపు వయస్సు,కనీసం 10 ఏళ్ల సేవా అనుభవం కలిగి ఉండాలని,ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో కనీసం 100 మంది విద్యార్థులు ఉండాలని పేర్కొన్నారు.శాఖాపరమైన భాగస్వామ్యం,ఉపాధ్యాయ శిక్షణ,రాష్ట్ర,జాతీయ అవార్డులు, పరిశోధన,ఈ–కంటెంట్ రూపకల్పన తదితర అంశాల ఆధారంగా ఎంపిక జరుగుతుందని తెలిపారు.అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 7లోపు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు,అనంతరం రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ తుది ఎంపిక చేపడుతుందని కలెక్టర్ తెలిపారు.విదేశీ పర్యటన ద్వారా పొందిన అనుభవాలను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసి విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ఎంపికయ్యే ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# ఎస్సీ,బీసీ సంక్షేమ హాస్టళ్లలో గీజర్లు,ఆర్ఓ ప్లాంట్లు,మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలి:పీవైఎల్ డిమాండ్

గద్వాల,జూలై 30(ప్రజా జ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎస్సీ,బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు తీవ్ర మౌలిక సదుపాయాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే గీజర్లు,ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య డిమాండ్ చేశారు.ఈ మేరకు జిల్లా సంక్షేమ హాస్టళ్ల అధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వర్షాకాలం,చలికాలంలో గీజర్లు లేక విద్యార్థులు చల్లని నీటితో స్నానం చేయాల్సి వస్తోందని,దీంతో జలుబు,జ్వరం,వైరల్ ఇన్‌ఫెక్షన్లు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.అలాగే అనేక హాస్టళ్లలో ఆర్ఓ ప్లాంట్లు లేకపోవడంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదని,కలుషిత నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొని కడుపు సంబంధిత వ్యాధులు,ఇతర అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పలు హాస్టళ్లలో




బాత్రూములు, మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడం,తాగునీటి సరఫరా సరిగా లేకపోవడం,విద్యుత్, ఫ్యాన్లు,లైట్లు,మంచాలు,పరుపులు వంటి మౌలిక వసతులు తగినంతగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.మెస్‌లో నాణ్యమైన, పోషకాహారం అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లాలోని అన్ని ఎస్సీ,బీసీ సంక్షేమ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని,గీజర్లు,ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటు సహా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని పీవైఎల్ డిమాండ్ చేసింది.విద్యార్థుల ఆరోగ్యం,విద్య,భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య విజ్ఞప్తి చేశారు.

## అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలి




**హసన్‌పర్తి, జులై 30(ప్రజాజ్యోతి) :** గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వర్ధన్నపేట శాసనసభ్యుడు కే.ఆర్. నాగరాజు సూచించారు. హసన్‌పర్తి మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, గ్రామాలను మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు యువతలో చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయో లేదో సర్పంచులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.తడి, పొడి చెత్త వేర్వేరుగా నిర్వహించడంపై గ్రామాల్లో మరింత అవగాహన కల్పించాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో మొక్కల నాటకాన్ని ఉద్యమంలా నిర్వహించాలని, వైద్యం, విద్య, వ్యవసాయ రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సమావేశంలో మొత్తం పదహారు అంశాలపై సర్పంచులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు.అనంతరం పదవీ విరమణ పొందనున్న మండల పంచాయతీ అధికారి కరుణాకర్‌రెడ్డిని ప్రజాసేవలను గుర్తిస్తూ శాలువాతో సన్మానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, ప్రత్యేక అధికారి మోహన్, మండల అధ్యక్షుడు అశోక్, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు తిరుపతి, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్పంచులు, మండల అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారి, మండల విద్యాధికారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దోపిడీదారులకు గొడుగు పడుతున్న మోడీ సర్కార్



**నర్సంపేట జూలై 30 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట గత 12 సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్న మోడీ సర్కార్ పెట్టుబడుదారులకు అవినీతి అక్రమార్కులకు గొడుగు పడుతుందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్నచంద్రన్న అన్నారు. నర్సంపేట లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ జిల్లా నాయకుడు బి నరసింహారావు అధ్యక్షత వహించరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.పేద సామాన్య మధ్యతరగతి ప్రజానీకాన్ని దోచుకుంటున్నపెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చే విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు.ఫలితంగా ద్వేషములు పేదరికం నిరుద్యోగం ఆకలి చావులు వలసలు పెద్ద ఎత్తున పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పేదలకు మంచి రోజులు రానున్నాయంటూ అధికారంలోకి వచ్చిన మోడీ అధాని,అంబానీ లాంటి కార్పొరేట్ గుత్తపెట్టుబడుదారులకు పెద్దపీట వేస్తూ సామాన్య ప్రజానీకాన్ని మరింత పేదరికంలోకి నేడుతుంది అన్నారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాసులైన ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు.సిపిఐ (ఎంల్ )మాస్ లైన్ లో చేరిన కోడి సోమయ్య సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ రైతు కూలి సంఘం పనిచేస్తున్న కోడి సోమయ్య పాయం చిన్న చంద్రన్న సమక్షంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం లో చేరాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ లైన్ దాని అనుబంధ సంఘాలు చేస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితుడినై ఇందులో చేరుతున్న అని కోడి సోమయ్య తెలిపారు.దేశంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సరైన దిశలో పోరాడుతున్న మాస్ లైన్ దాని అనుబంధ సంఘాలలో ప్రజలు పెద్ద ఎత్తున చేరాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంల్) మాస్ లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు డివిజన్ కమిటీ సభ్యులు ధార లింగయ్య.పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు అలవాల నరేష్ పి వై ఎల్ నాయకులు మనోహర్ తో పాటు భద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి

- మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలి
- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు




**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని తప్పనిసరిగా మెనూ పాటించాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎస్సీ ప్రీ - మెట్రిక్ హాస్టళ్లలో 2026--27 విద్యా సంవత్సరానికి అమలు చేయనున్న వారాంత ఆహార మెనూ పోస్టర్‌ను తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన,రుచికరమై భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడా లని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ షెడ్యూల్‌ను తప్పని సరిగా అమలుచేయాలని, ప్రతిరోజు నిర్ణయించిన ఆహార పదార్థాలనే విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఏఎస్ డబ్ల్యూఓ సురేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సోలార్ యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేయాలి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ఆత్మకూర్ మోడల్ సోలార్ విలేజ్లో లబ్ధిదారుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్





**ఆత్మకూరు, జులై 30 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా ఆత్మకూర్ గ్రామంలో అమలవుతున్న మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం కింద మిగిలిన లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆత్మకూర్ గ్రామంలో మోడల్ సోలార్ విలేజ్ పథకం అమలును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొల్లపల్లి గణపతి నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్‌ను పరిశీలించి, దాని పనితీరు, నిర్వహణ విధానం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలుగుతున్న ప్రయోజనాలపై వారితో మాట్లాడారు. అనంతరం గ్రామంలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పురోగతిపై తెలంగాణ రెడ్‌కో, విద్యుత్ శాఖ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మొదటి విడతలో అర్హులైన 764 మంది లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు మంజూరుకాగా, ఇప్పటివరకు 251 ఇళ్లలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఇళ్లకు అవసరమైన సామగ్రిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చి, ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైన ఆత్మకూర్ గ్రామంలో మిగిలిన లబ్ధిదారుల ఇళ్లలో కూడా సోలార్ యూనిట్ల ఏర్పాటు ఆలస్యం కాకుండా అవసరమైన మెటీరియల్‌ను వెంటనే సమీకరించి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, టీజీ రెడ్‌కో ఫీల్డ్ అధికారులు దీపక్, నవీన్ కుమార్ యాదవ్, ఆత్మకూర్ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు భరత్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను చదవడం, రాయడంలో ఉత్తమంగా ఉండేలా తీర్చిదిద్దాలి






- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఆత్మకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**ఆత్మకూరు, జూలై 30 (ప్రజాజ్యోతి) :** విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా, చదవడం, రాయడం, భావవ్యక్తీకరణలో మెరుగైన నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నిర్మల కుమారిని కలెక్టర్ పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంతమంది కొత్తగా ప్రవేశాలు పొందారని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో ఉపాధ్యాయులకు బోధనలో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, విద్యార్థి కేంద్రిత అభ్యాస విధానాలు, ప్రాథమిక భాషా మరియు గణిత నైపుణ్యాల పెంపు, నిరంతర మూల్యాంకన విధానాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించి ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలలో ఉన్న లైబ్రరీని పరిశీలించారు. వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండుతున్న భోజన పదార్థాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న టాయిలెట్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఏడో తరగతి విద్యార్థులకు భారతరత్న సర్ సివి రామన్ సంబంధించి ఆంగ్ల పాఠ్యాంశం ఉపాధ్యాయురాలు బోధిస్తుండగా కలెక్టర్ తరగతి గదిని సందర్శించారు. ఏ పాఠ్యాంశాన్ని చదువుతున్నారని విద్యార్థులను కలెక్టర్ అడగగా సివి రామన్ లెసన్ అంటూ బదులిచ్చారు. హూ వాజ్ సీవీ రామన్ అని ఆంగ్లంలో కలెక్టర్ అడుగగా గ్రేట్ సైంటిస్ట్ అంటూ విద్యార్థులు ఆంగ్లంలోనే సమాధానం ఇచ్చారు. దీంతో వెరీ గుడ్ అంటూ విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఆంగ్లంలో ఉన్న ఆ పాఠ్యాంశాన్ని విద్యార్థుల చేత కలెక్టర్ చదివించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ విద్యార్థులు విద్యా ప్రగతిలో ఉత్తమంగా నిలవాలంటే పాఠ్యాంశాన్ని బోర్డు మీద రాయడం కాకుండా డిక్టేషన్ గా ఉపాధ్యాయులు చెప్పడం ద్వారా విద్యార్థులు సొంతంగా రాయడం, చదవడంపై పట్టు సాధించగలరని అన్నారు. విద్యార్థులను ఇంగ్లీషులో బాగా రాయడం, చదవేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, ఎంఈఓ విజయ్ కుమార్, తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి రోగికి మెరుగైన చికిత్స అందాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి - ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ
- వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలని ఆదేశం
- ఓపీ నమోదు, మాతా-శిశు సేవలు, ఫార్మసీ, ఇమ్యునైజేషన్ విభాగాల పరిశీలన







**ఆత్మకూరు, జులై 30 (ప్రజాజ్యోతి) :** జిల్లాలోని ప్రభుత్వ వైద్య సంస్థల్లో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం ఆత్మకూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ విభాగం, మందుల నిల్వ గది, ల్యాబ్, ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్, అబ్జర్వేషన్ వార్డులు, టీకాల నిల్వ కేంద్రం, రికార్డుల నిర్వహణ, ఓపీ నమోదు విధానం, వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, మాతా-శిశు సంరక్షణ సేవల రికార్డులను పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓపీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ సకాలంలో వైద్యం అందించాలన్నారు. ఓపీ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గర్భిణులకు నాణ్యమైన మాతా-శిశు ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఫార్మసీలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా ప్రతి ఉద్యోగి సేవాభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ స్పందన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వేసుకోవడంపై రైతులకు అవగాహన

మండల వ్యవసాయ శాఖ అధికారి జి వీరభద్రం




**రాయపర్తి జూలై 30 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడంపై గురువారం రైతు సోదరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి వీరభద్రం మాట్లాడుతూ ఈ వానాకాలంలో ఎల్ నీ నో ప్రభావం సెప్టెంబర్ అక్టోబర్ మాసాలలో ఎక్కువగా ఉంటుంది దీని ప్రభావం వలన మనకు రావాల్సిన వర్షాలు తగినంత కురవకపోవడం వలన భూగర్భ జలాలు తగ్గిపోవడం చెరువులు డ్యామ్ లు నిండకపోవడం వలన రైతులకు వరి వేసుకున్న వాళ్లకు నీరు అందక పోవడం వల్ల నష్టపోవడం జరుగుతుంది. ఈ ఎల్ ని నో ప్రభావం వల్ల మనకు రావాల్సిన వర్షపాతం తగినంత కురువనందున రైతులు వరి పంట సాగు అనేది తగ్గించుకోమని సూచించడం జరిగింది. దానికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించడం జరిగింది.. బోర్ల కింద బావుల కింద ఉన్న తక్కువ నీటి తోటి ఆరు తడి పంట లైనటువంటి ఎస్ ఆర్ ఎల్ మినుములు కందులు , జొన్నలు, రాగులు కూరగాయలు వంటి పంటలను సాగు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని తెలూపడం జరిగింది.. ఈ పంటలకు తక్కువ నీటిని వాడుకుంటూ అధిక దిగుబడులు పండించుకోవచ్చని తెలియజేసినారు.

ఈ సంవత్సరం వరి పెట్టి రైతులు నష్టపోవద్దు అని సూచించడం జరిగింది..కావున రైతులందరూ కూడా వరి సాగు తగ్గించుకొని ఆరుత్తడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించడం అయినది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏం ఏ వోగుమ్మడి వీరభద్రం, ఏ ఈ వో ఎస్ గీతా, సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి, మరియు పంచాయతీ కార్యదర్శి యాకోబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిసిసి కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుండి తొలగించిన డీఎం




**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూలై 30 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ గిరిజన సహకార సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న వ్యక్తిని విధుల నుంచి తొలగించినట్లు డిఎం వాణి తెలిపారు. కొంతకాలంగా సంబంధిత కంప్యూటర్ ఆపరేటర్‌పై అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపించగా, వాటిపై విచారణ చేపట్టిన అధికారులు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో జీసీసీ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. అయితే, విధుల నుంచి తొలగింపు జరిగినప్పటికీ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. అలాగే జీసీసీ సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నర్సంపేట మున్సిపాలిటీలో 45 నిమిషాల్లో 51 ప్రస్తావనలు ఆమోదం

- ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా ప్రజాపాలన?
- బీజేపీ ఫ్లోర్ లీడర్ జూలూరి రోజారాణి



**నర్సంపేట జూలై 30 (ప్రజా జ్యోతి) :** బికౌన్సిల్ సాధారణ సమావేశం అని చెప్పి ప్రజల పన్నుల డబ్బుతో నడిచే నర్సంపేట మున్సిపల్ కౌన్సిల్‌ను కేవలం 45 నిమిషాల్లో ముగించిన ఘనత చైర్పర్సన్ గారిది.51 కౌన్సిల్ ప్రస్తావనలు. చర్చ లేదు, వాదన లేదు, ప్రశ్నించే అవకాశం లేదు, జస్ట్ ఆమోదంఅని స్టాంప్ కొట్టి పంపేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు కౌన్సిలర్లకు కూడా సమయం ఇవ్వలేదు. ఇది సమావేశం కాదు,ఇది సర్కస్,ఇది ప్రజాస్వామ్యం కాదు,ఇది నియంతృత్వంప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటూ,ప్రజల సమస్యలను 45 నిమిషాల్లో తుంగలో తొక్కిన చైర్పర్సన్ మరియు కాంగ్రెస్ కౌన్సిలర్లకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారు.గతంలో కొంతమందిని పీహెచ్ వర్కర్స్ గా తీసుకొని,ఆ పని నాముషీఅని చెప్పి పైరవీలతో అవసరం లేకున్నా వారిని ఇతర విధుల్లోకి మార్చారు.ఇప్పుడు ఉన్న సిబ్బందిని వాడకుండా కొత్త నియామకాలు ఎందుకు?శానిటేషన్,చెత్త ఎత్తడం, మురికి కాలువలు శుభ్రం,అత్యవసర పరిపాలన అవసరం అనే పేరుతో 20 మందిని అవుట్సోర్సింగ్ రోజువారి కూలీలుగా తీసుకోవడానికి కౌన్సిల్ ప్రస్తావన తెచ్చారు జస్ట్ కౌన్సిల్ లో పెట్టి ఆమోదించేశారు.ఇది శానిటేషన్ కోసం కాదు ఇది కాంగ్రెస్ కౌన్సిలర్లు జేబులు నింపుకోవడానికి వేసిన క్లియర్ ప్లాన్ అని స్పష్టంగా అర్థమవుతుంది.నర్సంపేట స్మశాన వాటిక అధ్వాన స్థితి 30 లక్షలతో కొత్త డ్రామా!నర్సంపేటలో స్మశాన వాటిక ఎంత అధ్వానంగా ఉందో ప్రజలందరికీ తెలుసు.కానీ ఆ స్మశాన వాటికను సుందరీకరించకుండా,అందులో టాయిలెట్లకు మరియు నీటి సరఫరాకు 30 లక్షల రూపాయలు కేటాయించడం జరిగింది.ఈ 30 లక్షలు దేనికోసం? కేవలం వాటర్ సప్లై కోసమే 30 లక్షలా?కొన్ని రోజుల క్రితమే మాధవ రెడ్డి స్మశాన వాటికలో బోర్ వేయించడం జరిగింది.

గత పాలకవర్గం అక్కడ రెండు గదులు కట్టి,పైన నీటి సదుపాయం కోసం ఒక ట్యాంక్ కూడా నిర్మించింది. ఇప్పుడు దాన్ని మరమ్మత్తు చేస్తే సరిపోతుంది కదా?అలా చేయకుండా మళ్లీ 30 లక్షలతో కొత్త పనుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.ఇలా నర్సంపేట మున్సిపాలిటీలో కోట్లరూపాయల అవినీతి జరుగుతుంది. దీన్ని ప్రజలందరూ గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ఈ అక్రమ నియామకాలపై మరియు 45 నిమిషాల సర్కస్ పై బీజేపీ పోరాటం కొనసాగుతుంది. ఈ విషయాన్ని వెంటనే జిల్లా కలెక్టర్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి దృష్టికి తీసుకుపోతాం. ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఊరుకునేది లేదు.అని తెలిపారు.



## నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

**రాయపర్తి జూలై 30 ప్రజా జ్యోతి :** సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మె ఎల్ ఏ పెద్ది సుదర్శన్ రెడ్డినీ కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రులు పరామర్శించారు.

పరామర్శించిన వారిలో తన్నీరు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ , మాజీ ఎమ్మెల్యే లు, పరామర్శించారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్ది ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకొని, మునుపటిలాగే ప్రజాక్షేత్రంలో చురుకుగా సేవలందించాలనిఆకాంక్షించారు...



## ఎమ్మెల్యే సామెల్ కృషి ఫలితమే తుంగతుర్తికి ఫైర్ స్టేషన్ మంజూరు : రేగటి రవి గౌడ్

### మండల ప్రజల్లో హర్షం.. మరింత చేరువ కానున్న అత్యవసర సేవలు

తుంగతుర్తి, జూలై 30,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి ఫైర్ స్టేషన్ మంజూరు కావడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మందుల సామెల్ నిరంతర కృషి, ప్రభుత్వంతో చేసిన ప్రత్యేక విజ్ఞప్తుల ఫలితంగానే ఈ ఫైర్ స్టేషన్ మంజూరైందని కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్ స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం



చేశారు. ఇప్పటివరకు అగ్నిప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు దూర ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు రావాల్సి వచ్చేది. దీంతో సహాయక చర్యల్లో జాప్యం ఏర్పడేదనీ, ఇకపై తుంగతుర్తిలోనే ఫైర్ స్టేషన్ అందుబాటులోకి రావడంతో అగ్నిప్రమాదాల సమయంలో వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడే అవకాశం ఏర్పడనుందన్నారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటు వల్ల తుంగతుర్తి మండలంతో పాటు పరిసర మండలాల ప్రజలకు కూడా మెరుగైన అత్యవసర సేవలు అందనున్నాయన్నారు. ఈ నిర్ణయం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫైర్ స్టేషన్ మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి మరియు సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే మందుల సామెల్ కు మండల ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందిస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ఎమ్మెల్యే సామెల్ కృషి నిరంతరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసరి శ్రీను, చింతకుంట్ల బాబు, రుద్ర రామచంద్రు, రాఘవులు, అబ్బ గాని వేణు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన సంకినేని బ్రదర్స్

తుంగతుర్తి, జూలై 30,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి పట్టణానికి చెందిన కత్తుల వెంకన్న భార్య కత్తుల నవ్య ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆమె కుటుంబానికి సంకినేని బ్రదర్స్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. సంకినేని బ్రదర్స్ తరపున అందజేసిన ఈ సహాయాన్ని తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబు గురువారం మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేసి



ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఉప్పుల లింగయ్య, రఫీక్, వార్డు సభ్యులు యాదగిరి, ఎం. వెంకన్న, రవి, యు. వెంకన్న, సీహెచ్. వెంకన్న, బి. నరేష్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కత్తుల నరేష్, ఏవైసీ అధ్యక్షుడు ప్రశాంత్, బీజేపీ నాయకులు సుధాకర్, పరమేష్, ఇరుగు సురేష్, మధు, రాంబాబు, పి. వెంకన్న, నరేందర్, నవీన్, మనోజ్, హరీంద్రతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి అండగా నిలిచిన సంకినేని బ్రదర్స్ సేవా భావాన్ని పలువురు అభినందించారు.

## ఎమ్మెల్యే కృషితోనే తుంగతుర్తికి ఫైర్ స్టేషన్

### నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తున్న ఎమ్మెల్యే సామెల్

### కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి

తుంగతుర్తి, జులై 30,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్ కృషి ఫలితమే తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి ఫైర్ స్టేషన్ మంజూరైందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి అన్నారు.



గురువారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక కేంద్రానికి దూరంగా ఉన్న సూర్యాపేట నుంచి తుంగతుర్తికి ఫైర్ సిబ్బంది వచ్చేవరకు భారీగా నష్టం జరిగేదని తెలిపారు.తుంగతుర్తిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు జరిగితే ఈ మండలానికి దగ్గరగా ఉన్న ఐదు మండలాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సామెల్ ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణంతోపాటు గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడీ భవనాలు,గ్రామపంచాయతీ భవనాలు, మహిళ శక్తి భవనాలు తో పాటు తొండ గ్రామంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి ఫైర్ స్టేషన్ మంజూరు చేసినందుకుగాను స్థానిక శాసనసభ్యులు మందుల స్వాములకు కృతజ్ఞతలు తెలిపారు.

## చెరువుగట్టు అగ్ని ప్రమాద బాధితులకు అండగా నిలిచిన బి ఆర్ ఎస్ నాయకులు

నార్కట్ పల్లి, జూలై 30 ( ప్రజా జ్యోతి ):
నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాద బాధితులకు బి ఆర్ ఎస్ పార్టీ నాయకురాలు రేగట్ట శోభ మల్లికార్జున్ రెడ్డి ( శోభమ్మ ) బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, అదేవిధంగా చొల్లేటి జ్ఞానేష్ 10,000 ఆర్థిక సహాయాన్ని నష్టపోయిన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు అండగా ప్రతి ఒక్కరు, ఏ పార్టీ అని తేడా లేకుండా సహాయం చేయాలని ఆమె కోరారు. కష్టకాలంలో బాధితులను ఆదుకోవడం మానవత్వానికి నిదర్శనమని, బాధిత కుటుంబాల వారికి మనోధైర్యాన్ని కల్పించి, తాను ఎల్లప్పుడూ అందుబాటులో



ఉంటానని వారికి భరోసాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్ల రమణ బాలకృష్ణ, రేగట్టె మహేందర్ రెడ్డి, నడింపల్లి శ్రీను స్వామి, మాజీ వార్డు సభ్యులు సొల్లేటి జ్ఞానేశ్వర్, వార్డు సభ్యులు చీర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ కృషి

### మెనూ సక్రమంగా అమలు చేయాలి

### విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరిక

### ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

### బిసి బాలికల గురుకుల ఆకస్మిక తనిఖీ



మిర్యాలగూడ, జులై 30,( ప్రజాజ్యోతి ):
నాణ్యమైన విద్యను అందించి సర్కార్ బడులు,గురుకులాలను బలోపేతం చేసే దిశగా



ప్రభుత్వం కృషి చేస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం ను మండల విద్యాశాఖ అధికారి ధర్మానాయక్ తో కలిసి ఆకస్మికంగా చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మౌలిక వసతులను, విద్యార్థు లకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి టీచర్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. గురుతరమైన బాధ్యతను అంకితభావంతో నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు, విద్యా బోధన, సిబ్బంది సమస్యలు, ఇతర అవసరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, సంబంధితఅధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.తదుపరి విద్యార్థులతోముఖాముఖి సమావేశమై వారి విద్యాభ్యాసం, హాస్టల్ వసతులు, ఆహారం, తాగునీరు, పరిశుభ్రత, ఇతర సమస్యలగురించి అడిగి తెలుసుకుని,



విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులుతలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకుప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రం లో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంద న్నారు.ప్రభుత్వ పాఠ శాలలు, గురుకులాల్లో విద్యా ప్రమాణాలను మరింతమెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులుఅందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతిరోజూమిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన చర్యలుతీసుకుంటాననివెల్లడించారు.అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉదయం అసెంబ్లీలోవిద్యార్థులతో కలిసి పాల్గొని వారికి విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫామ్‌లను విద్యార్థులకు పంపిణీ చేసి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలనుఅధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం

### ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి: జడ శ్రీనివాస్

మఠంపల్లి జూలై 30 (ప్రజా జ్యోతి):
సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆగస్టు 1న నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.మఠంపల్లి మండల కేంద్రంలో కార్మికులతో కలిసి జిల్లా మహాసభల కరపత్రాలను ఆయన విడుదల చేశారు.ఈ సందర్భంగా జడ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన ఏఐటీయూసీ,నాటి నుంచి నేటి వరకు కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి వారి హక్కులను సాధించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు.కార్మికుల హక్కులను కాలరాసే విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు.కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేయవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ముఖ్యంగా నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ,భవిష్యత్ పోరాట కార్యాచరణపై జిల్లా మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని కార్మికులు,ఏఐటీయూసీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రాంతీయ ఉపాధ్యక్షులు సయ్యద్ రన్ మియా, సహాయ కార్యదర్శి




దేశబోయిన వీరయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు చిన్నపొంగు శ్రీను,ఎస్.కె.భగవాన్, కొత్తపల్లి విశాఖ, ఎస్.కె.మూసా, మాతంగి కొండలు,దుగ్గి సైదులు, ఎస్.కె. మదర్, తెల్లబాటి సత్యనారాయణ, రెడపంగు లాజర్,పీవీ నరసింహారావు, వల్లభదాస్ వీరబాబు,ఎస్.కె.సైదిల్లి తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుడు దేవపంగు బాబుకు ఘన నివాళి

### పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

మఠంపల్లి జూలై 30 (ప్రజా జ్యోతి) :
ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయుడు దేవపంగు



బాబు పెద్దకర్మ కార్యక్రమం మఠంపల్లి మండలం రఘునాధపాలెం గ్రామంలో గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు,నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు,గ్రామ ప్రముఖులు హాజరై దేవపంగు బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ,పాత్రికేయ రంగంలో దేవపంగు బాబు అందించిన సేవలను కొనియాడారు.నిరంతరం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని, మాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.బాబు మృతి పాత్రికేయ రంగానికి, ఆయనను అభిమానించే కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు తీరని లోటని అన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.పెద్దకర్మ కార్యక్రమంలో ఎంఈఓ చత్రు నాయక్, లాయర్ గోవిందు నాయక్,ఏసుమల్ల రాములు,ఫీల్డ్ అసిస్టెంట్లు గోపయ్య, బిక్షం, శౌరీ నాయక్,కందుకూరి పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని దేవపొంగు బాబుకు నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి వినూత్న నిర్ణయం

### ప్రభుత్వ బడిలో చేర్పిస్తే పంచాయతీ పన్ను రద్దు

దేవరకొండ, జూలై 30(ప్రజాజ్యోతి):
దేవరకొండ, మైనంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలను



బలోపేతం చేయడమే లక్ష్యంగా నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని మైనంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కొర్ర రాంసింగ్ ఒక అద్భుతమైన, వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మైనంపల్లి గ్రామ ప్రజలు తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేలా ప్రోత్సహించడానికి ఆయన ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు.తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపే కుటుంబాలకు గ్రామ పంచాయతీ పన్నును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు సర్పంచ్ కొర్ర రాంసింగ్ అధికారికంగా ప్రకటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన స్థానిక ప్రజల సమక్షంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. నేటి తరం పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.సర్పంచ్ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయంపై మైనంపల్లి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సర్పంచ్ కొర్ర రాంసింగ్ చేసిన ఈ సాహసోపేతమైన ఆలోచనను మరియు తీసుకున్న నిర్ణయాన్ని గ్రామ ప్రజలందరూ ఏకగ్రీవంగా హర్షిస్తూ, ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు.ఈ ప్రత్యేక కార్యక్రమంలో మైనంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## గుడిపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎల్‌పీఓ శంకర్ నాయక్

దేవరకొండ,గుడిపల్లి, జూలై30(ప్రజాజ్యోతి):
దేవరకొండ డివిజన్ పంచాయతీ అధికారి డీఎల్‌పీఓ శంకర్ నాయక్ గురువారం మండల పరిధిలోని గుడిపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణపై పంచాయతీ కార్యదర్శికి పలు ముఖ్యమైన సూచనలు చేశారు.అనంతరం





గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కల నాటడం ప్లాంటింగ్ వాటి సంరక్షణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా, విబి-జిఆర్ఏయంజి పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమంలో నిర్మిస్తున్న ఫారం పాండ్ పంట కుంట పనులను డీఎల్‌పీఓ శంకర్ నాయక్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో నీటి ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వర్షపు నీటిని ఎలా భూమిలోకి ఇంకించాలో, నీటిని ఎలా కాపాడుకోవాలో గ్రామ ప్రజలకు, అధికారులకు వివరించారు.ఈ కార్యక్రమంలో గుడిపల్లి గ్రామ సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ అజీమ్, ఇంచార్జ్ ఎంపీఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్ మరియు వీబీజీ రామ్‌జీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

భూదాన్ పోచంపల్లి, జూలై 30 (ప్రజాజ్యోతి):
ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త "జైల్ భరో" కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ముట్టడిని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక



సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. పోచంపల్లిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం, రైతులకు చట్టబద్ధమైన ఎంఎస్పీ, ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ప్రసాదం విష్ణు, సీఐటీయూ పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





**రాయికోడ్ జూలై 30 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశాజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధన్న పాటిల్, మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కేదారనాథ్ పాటిల్, ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, సర్పంచ్ రాధ తుకారాం, అల్లాపూర్ సర్పంచ్ చరణ్ కుమార్,మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాగిశెట్టి పాటిల్, మాజీ చైర్మన్ నజీర్, సంగమేష్ పటేల్, మాజీ యువత అధ్యక్షుడు విదర్శన్ రెడ్డి,యువజన అధ్యక్షుడు ప్రభాకర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు,మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# శంకుస్థాపనకే పరిమితమైన రూ.5.26 కోట్ల రహదారి

- ఏడాది గడిచినా పనులు మొదలుకాలేదు
- గుంతలమయమైన సింగూరు
- ఆత్మకూరు లింక్ రోడ్డు
- ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణిస్తున్న వాహనదారులు
- రీల్స్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న యువత





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి జూలై 30:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని సింగూరు--ఆత్మకూరు గ్రామాలను అనుసంధానించే మాలపాడు--బుసరెడ్డిపల్లి--మల్‌రెడ్డిపేట--బొబ్బిలి గ్రామాల లింక్ రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాలు కురవడంతో రహదారి అంతా భారీ గుంతలు, బురదతో నిండిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారిపై ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ దారి ఉందో గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాల నుంచి లారీలు, వ్యవసాయ వాహనాల వరకు ఈ మార్గంలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల గుంతల్లో వాహనాల టైర్లు పూర్తిగా మునిగిపోతుండగా, పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

**శంకుస్థాపనతోనే సరిపెట్టారా..?**

ఈ రహదారి నిర్మాణానికి 2025 మే 13న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా రూ.5.26 కోట్ల వ్యయంతో శంకుస్థాపన జరిగింది. శిలాఫలకం ఏర్పాటు చేసి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైంది.

**అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు**

రహదారి దుస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి



మరింత దారుణంగా మారడంతో పాఠశాల విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**రీల్స్‌తో యువత వినూత్న నిరసన**

శిలాఫలకం వద్దకు వెళ్లి "ఈ రోడ్డు కోసం ఎవరిని అడగాలి?" అంటూ యువకులు సోషల్ మీడియాలో రీల్స్ రూపొందించి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రశ్నిస్తున్నారు.

**తక్షణమే పనులు ప్రారంభించాలన్న డిమాండ్**

ఈ రహదారి చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాన అనుసంధాన మార్గం కావడంతో వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శంకుస్థాపనలకే పరిమితం కాకుండా నిధులను వినియోగించి పనులు పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# జలసిరి విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

– అందోల్‌లో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఏపీడీ బాలరాజు సమీక్ష





**అందోల్, జూలై 30, (ప్రజాజ్యోతి):** ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జలసిరి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీడీ బాలరాజు సూచించారు. గురువారం అందోల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన పనులపై అధికారులకు అవగాహన కల్పించిన ఆయన, ఇప్పటివరకు గ్రామాల వారీగా చేపట్టిన డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్స్, ఫార్మ్ పాండ్స్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (ఐహెచ్‌హెచ్‌ఎల్‌లు), వనమహోత్సవం కింద మొక్కల నాటడం, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. పతి గ్రామంలో లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ నిర్దేశించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

– జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

– కంట్రోల్ రూమ్ నెంబర్ 08455-276155



**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 30:-** భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజల నుండి అందే అత్యవసర ఫిర్యాదులు, సమాచారం, నష్టం వివరాలను వెంటనే స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు, వరదలు, రహదారి అంతరాయాలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సమస్యలు లేదా ఇతర ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని 08455-276155 నంబర్‌కు వెంటనే తెలియజేయాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించడానికి సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించామని, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత తహసీల్దార్‌కు వెంటనే పంపించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అవసరం లేనప్పుడు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదని, అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

# భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి

– కల్హేర్ ఎస్ఐ రవి గౌడ్



**కల్హేర్: 30.జూలై. ప్రజా జ్యోతి.** మండలంలో నిన్న రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్హేర్ ఎస్ఐ రవి గౌడ్ సూచించారు. అన్ని గ్రామాల ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, తల్లిదండ్రులు పిల్లలను బయటకు వెళ్లకుండా చూడాలని కోరారు. శిథిలావస్థకు చేరిన, పాడుబడిన ఇళ్లలో నివసిస్తున్న వారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెరువులు, వాగులు, కాలువల వద్దకు వెళ్లవద్దని, ముఖ్యంగా పిల్లలు, యువకులు వాటి సమీపానికి వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యుత్ స్థంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, ఇంట్లోని విద్యుత్ పరికరాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే పోలీసులను సంప్రదించడంతో పాటు డయల్--100కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రవి గౌడ్ ప్రత్యేక విజ్ఞప్తి చేస్తున్నారు.

# జహీరాబాద్ మున్సిపల్ ఎదుట చెప్పుతో కొట్టుకున్న కౌన్సిలర్ భర్త

- మా మద్దతుతో పీఠం ఎక్కి.. మా వార్డులకే ద్రోహం చేస్తారా ?
- కాంగ్రెస్ చైర్మన్ పై నిప్పులు చెరిగిన ఎంఐఎం నేత
- ఆరు నెలలుగా వార్డులో ఆగిపోయిన అభివృద్ధి పనులు పట్టించుకోని చైర్మన్, కమిషనర్.
- మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ మీటింగ్ జరుగుతుండగా తీవ్ర నిరసన.
- ఎంఐఎం నుంచి గెలిచి కాంగ్రెస్ కు మద్దతు తెలిపినందుకు ప్రాయశ్చిత్తంగానే ఈ శిక్ష అంటూ ఆవేదన






**జహీరాబాద్, జూలై 30(ప్రజా జ్యోతి న్యూస్)** మున్సిపల్ చైర్మన్,కమిషనర్ ల నియంతృత్వ, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మున్సిపల్ కార్యాలయం ఎదుట కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో ఒక కౌన్సిలర్ భర్త తనకు తాను చెప్పుతో కొట్టుకుని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీ నుంచి గెలిచి, కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించి నందుకు ప్రాయశ్చిత్తంగానే ఈరోజు ఈ నిర్ణయం తీసుకున్నా నని ఆయన మీడియా ముఖంగా ఆవేదన, ఆక్రోశం వెళ్లగక్కారు. గత ఆరు నెలలుగా తమ వార్డులో కనీస అభివృద్ధి పనులు జరగడం లేదని, ఎన్నిసార్లు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ల దృష్టికి తీసుకెళ్లినా వారిలో కనీస చలనం లేదని ఆయన మండిపడ్డారు. పదే పదే మొరపెట్టుకున్నా పట్టించు కునే నాథుడే కరువయ్యా రని, తమ వార్డు ప్రజలకు సమాధానం చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవు తున్నామని స్పష్టం చేశారు. "అధికారం కోసం వాడుకుని. ఇప్పుడు వదిలేస్తారా ?" జహీరాబాద్ మున్సిపాలిటీ లో ఎంఐఎం పార్టీ రెండు స్థానాలను కైవసం చేసుకుంది. చైర్మన్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు అవసరం కాగా, ఎంఐఎం సభ్యులు కాంగ్రెస్ కు మద్దతు తెలిపి వారిని చైర్మన్ పీఠంపై కూర్చో బెట్టారు. "మా మద్దతుతో గెలిచిన తర్వాత, ఇప్పుడు మమ్మల్నే పక్కకు పెట్టి మా వార్డుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసం ?" అని వారు సూటిగా ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ చైర్మన్ ప్రదర్శిస్తున్న రాజకీయ కృతఘ్నతకు నిదర్శనం అని దుయ్యబట్టారు. కార్యాచరణ కు హెచ్చరిక మేము మద్దతు ఇవ్వకపోతే మీరు ఆ కుర్చీలో కూర్చునే వారే కాదు అన్న వాస్తవాన్ని చైర్మన్ గుర్తుంచుకోవాలి. కేవలం పదవి దక్కేవరకే ఒక మాట, దక్కిన తర్వాత మరొక మాట మాట్లాడటం మానుకోవాలి. తక్షణమే మా వార్డులో ఆగిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించాలి. చైర్మన్, కమిషనర్లు తమ మొండి వైఖరిని వీడి పనులు చేపట్టకపోతే, రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన ఇంతకంటే తీవ్రమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతాం అని వారు హెచ్చరించారు.

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

– కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్



**జహీరాబాద్, జూలై 30(ప్రజా జ్యోతి న్యూస్)** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ కోరారు. గురువారం నిర్వహించిన మున్సిపాలిటీ అత్యవసర సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై గుంతలను ఎప్పటి కప్పుడుపూడ్చేయాలన్నారు తద్వారా వాహనాలు ప్రమాదానికి గురి కాకుండా చూడాలన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి అక్కడ నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలవ్యాప్తిగా జరగ కుండా తరచూ ఫాగింగ్ చేపడుతుండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంత రాయం లేకుండా చూడాలన్నారు. శిథిలా వస్థలో ఉన్న నిర్మాణాలు గుర్తించి ప్రజలను అక్కడ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు వర్షం పడినప్పుడు జాగ్రత్తగా ఎలా ఉండాలో అవగాహన కల్పించాలని కౌన్సిలర్ అప్పం శ్రావన్ సూచించారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితిలో మున్సిపాలిటీ వాసులు సంప్రదించడానికి ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబరు ఏర్పాటు చేయాలని విన్నవించారు. హైదరాబాద్ లో డిసాస్టర్ రెస్పాన్స్ టీంలాగా జహీరాబాద్ లో కూడా ప్రత్యేక బృందాలను నియమించాలని మున్సిపల్ కమిషనరుతో పాటు చైర్మన్ ను కోరారు. అధికారులు సరిగ్గా స్పందించడం లేదు. స్ట్రీట్ లైట్స్ విషయమై కౌన్సిలర్ అప్పం శ్రావణ్ మాట్లాడుతూ ప్రజలు వీధి దీపాల కోసం చాలాకాలంగా ఫిర్యాదులు అందిస్తున్నారని అన్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా సరైన స్పందన లభించడం లేదన్నారు. తాము కాల్స్ చేసినా అధికారులు ఎత్తడం లేదని. కనీసం తిరిగి కాల్ చేయడం లేదని అన్నారు. ప్రజాప్రతినిధులుగా తమకు అధికారులిచ్చే గౌరవం ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పక్షానికి ఒకలాగా, ఇతర పక్షాల కౌన్సిలర్లకు ఒకలాగా న్యాయం ఉందా అని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ఇప్పటికైనా స్ట్రీట్ లైట్స్ సమస్యతో పాటు ఇతర ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# అందోల్ మండలంలోని ఏడు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు..

– వర్షపు నీటిని ఒడిసిపట్టడంపై దృష్టి – ఎల్‌నినో సవాల్‌కు 'జలసిరి'తో ముందస్తు చర్యలు

**అందోల్, జూలై 30, (ప్రజాజ్యోతి):** ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో భూగర్భ జలాలను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'జలసిరి' కార్యక్రమాన్ని అందోల్ మండలంలో ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గురువారం చింతకుంట, తాలెల్మ, అన్నాసాగర్, కొండారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి తండా, డాకూర్, నేరడిగుంట గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొని వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టాల్సిన చర్యలను గ్రామస్తులకు వివరించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పడే ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. "ఇంటికో ఇంకుడు గుంత -- పొలానికి పంటకుంట -- ఊరికో ఊటకుంట" అనే నినాదంతో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, వ్యవసాయ భూముల్లో ఫార్మ్ పాండ్లు, గ్రామాల్లో నీటి నిల్వ నిర్మాణాలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్లు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, వనమహోత్సవం కింద మొక్కల నాటడం వంటి కార్యక్రమాలు నీటి వనరుల సంరక్షణలో కీలకమని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని అధికారులు సూచించారు. ఈ గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







## ప్రశ్నలకు భయమేనా..?

# మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి మీడియాకు నో ఎంట్రీ



**మెదక్ (ప్రజా జ్యోతి )జూలై 30** మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిపై టిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, ఎలాంటి పనులు చేపట్టడం లేదని అధికారులు ఇబ్బందికర ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే మీడియాను సమావేశానికి దూరంగా ఉంచారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా డబుల్ బెడ్రూమ్ కాలనీల వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని, ఇటీవల ఓ బాలికపై జరిగిన దాడి ఘటనపై కూడా ప్రశ్నలు వెల్లువెత్తే అవకాశం ఉండటంతో సమావేశానికి మీడియాను అనుమతించలేదనే చర్చ సాగుతోంది. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై జరిగే సర్వసభ్య సమావేశాన్ని మీడియాకు మూసివేయడం పారదర్శకతపై సందేహాలు రేకెత్తిస్తోంది. ప్రజల సమస్యలపై చర్చ జరిగే వేదికకు మీడియాను దూరంగా ఉంచడం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే, మీడియాను అనుమతించకపోవడానికి గల కారణాలపై మున్సిపల్ యంత్రాంగం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ వెలువడలేదు.

## ముసురు పట్టిన మెదక్..!

# మూడు రోజులుగా ఎడతెరిపి లేని జల్లులు



**మెదక్ (ప్రజా జ్యోతి) జూలై 30:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లులతో మెదక్ నగరం పూర్తిగా ముసురుపట్టింది. నల్లని మేఘాలు నగరాన్ని కమ్మేయగా, ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో నగరం తడిసి ముద్దవగా, రహదారులు ఎప్పటికప్పుడు తడిగా మారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరంతర వర్షాల ప్రభావంతో ప్రజల రాకపోకలు మందగించాయి. వ్యాపార కార్యకలాపాలపై కూడా ప్రభావం పడగా, చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, వర్షాల కారణంగా వాతావరణం ఆహ్లాదకరంగా మారినప్పటికీ, ముసురు కొనసాగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ వాతావరణాన్ని రైతులు మాత్రం సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న రోజుల్లో కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ అయ్యాయి.

# బీజేపీ ఓబీసీ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీ ఎన్నిక

### – అధ్యక్షుడుగా మల్లన్నగారి బిక్షపతి


అధ్యక్షుడు మల్లన్నగారి బిక్షపతి


మామిండ్ల నాగులు ప్రధాన కార్యదర్శి


బొడ్డు నర్సింలు ప్రధాన కార్యదర్శి

**సిద్దిపేట అర్బన్, జులై 30(ప్రజాజ్యోతి):-** భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీని గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ప్రకటించారు.బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మల్లన్నగారి బిక్షపతి,ఉపాధ్యక్షులుగా బడెకోల్ నర్సింహులు,కంకణాల నర్సింహులు,కొండి శంకర్, ప్రధాన కార్యదర్శులుగా మామిండ్ల నాగులు, బొడ్డు నర్సింహులు, కార్యదర్శులుగా దేవుని ఉపేందర్, నిమ్మల శ్రీనివాస్, కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా చెన్నగోని వెంకటేష్ గౌడ్, పున్న రమేష్, రంగనబోయిన కుమార్,పులిగారి స్వామి, కొయాల్కర్ హరి శంకర్,గవ్వల రమేష్, కాంటలపల్లి వేణుగోపాల్, బట్టు తిరుపతి, కోరే సంతోష్ కుమార్, అప్పల మల్లేష్, మండె సంపత్, సగ్గు కృష్ణ యాదవ్ లు ఎన్నికయ్యారు.

# మండల స్థాయి సమావేశంలో శాఖల పనితీరుపై సమీక్ష




**కొండపాక, జూలై 30: (ప్రజా జ్యోతి ):-** కుకునూరుపల్లి మండల రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి కె. మల్లయ్య అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్, ఏఎంసీ చైర్మన్, మండల పంచాయతీ అధికారి, వివిధ శాఖల అధికారులు, మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయం, గ్రామీణ మంచినీటి



సరఫరా, విద్య, పంచాయతీరాజ్, సెర్ప్, పౌర సరఫరాలు, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్యం, హోమియో వైద్యం, విద్యుత్, సమగ్ర శిశు సంక్షేమం, నీటి పారుదల, ఆర్అండ్‌బీ, గ్రామీణాభివృద్ధి, టీఎస్ఆర్టీసీ, అటవీ, ఉద్యానవన, హౌసింగ్ తదితర శాఖల కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి కె. మల్లయ్య సూచించారు. సమావేశంలో ఇతర ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపైనా చర్చించారు.

# స్నేహానికి నిలువెత్తు నిదర్శనం

### – మిత్రుడి కుటుంబానికి రూ.11 వేల సాయం



**నంగునూరు, జూలై 30(ప్రజా జ్యోతి):-** కష్టకాలంలో మిత్రులే నిజమైన బలం అని నిరూపిస్తూ నంగునూరుకు చెందిన బొజ్జ గోపి కుటుంబానికి ఆయన సహచర విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన గోపి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో 1997 - 98 విద్యా సంవత్సరంలో ఆయనతో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.11 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామానికి చెందిన బొజ్జ గోపి (44) దర్జీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయన మృతితో భార్య, కుమారుడు దిక్కుతోచని స్థితిలో ఉండగా, విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు వెంటనే స్పందించారు. తమ స్నేహితుడి కుటుంబానికి తోడుగా నిలవాలనే సంకల్పంతో అందరూ కలిసి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్నేహం అనేది కేవలం కలిసి చదివిన జ్ఞాపకాలకే పరిమితం కాదని, అవసరమైన సమయంలో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన స్నేహమని పేర్కొన్నారు. తమ మిత్రుడు ఇక లేడనే బాధ ఉన్నప్పటికీ, ఆయన కుటుంబానికి తమ వంతు సహకారం అందించడం బాధ్యతగా భావించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. సహచరుల ఆర్థిక సాయంతో మృతుడి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్ననాటి స్నేహాన్ని మరువకుండా మిత్రుడి కుటుంబానికి సహాయం అందించిన ఈ చర్య గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. మానవత్వం, స్నేహ బంధానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం పలువురికి ఆదర్శంగా నిలిచిందని గ్రామ పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో పప్పు సురేందర్ రెడ్డి, ఎండి షాకీర్, ఇరుకుల్ల కృష్ణ, దాసరి శ్రీనివాస్, కట్కూరు భూపాల్ రెడ్డి, పాపిగాని కృష్ణ, రాగుల చంద్రం, సనాధుల సతీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ

# రవాణాపై విద్యార్థులకు అవగాహన



**చిన్నకోదూరు, జూలై30, (ప్రజాజ్యోతి):-** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమశాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఇబ్రహీంనగర్ లోని ఆదర్శ పాఠశాల కళాశాలలో భేటీ బచావో భేటీపడావో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ లావణ్య మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా,బాల్య వివాహాలు,పోక్సో చట్టం, మహిళా చిన్నారుల రక్షణ, హెల్ప్‌లైన్ నంబర్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలికల రక్షణ, మహిళా సాధికారతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్, రాజశ్రీలత, ఉపాధ్యాయులు స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని

# పరామర్శించిన బక్కి వెంకటయ్య



**మిరుదొడ్డి, జూలై 30, (ప్రజాజ్యోతి):** అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన మంతూరు కొండల్ తల్లి లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, లక్ష్మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి తన సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట దుబ్బాక పాక్స్ చైర్మన్ కైలాసం, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మండల కుమార్, బేగంపేట సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, జంగపల్లి నరసింహారెడ్డి, నగరం నారాయణరెడ్డి, జయరాజు, సిద్దిరాములు, జగన్ తదితరులు ఉన్నారు.

# విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### – వంగ నర్సిరెడ్డి, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి



**నంగునూరు, జూలై 30(ప్రజా జ్యోతి):-** విద్యారంగంలో పేరుకు పోయిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. తపస్ నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వంగ నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు డీఏలను పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. మూడు సంవత్సరాలు గడిచినా పీఆర్సీపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. బదిలీలు, పదోన్నతుల అంశాలను నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ అమలు చేయడం లేదన్నారు.


**ఆగస్టు 1 ధర్నాకు మద్దతు కోరిన తపస్**

తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతర పోరాటం కొనసాగిస్తోందన్నారు. ఈ పోరాటంలో భాగంగా ఆగస్టు 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న భారీ ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**

తపస్ నంగునూరు మండల అధ్యక్షుడు కత్తుల రాంరెడ్డి మాట్లాడుతూ, సంఘం పట్ల ఉపాధ్యాయులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సిద్దిపేట డివిజన్ కార్యదర్శి అనుముల వీరేశం మాట్లాడుతూ, సభ్యత్వ అభియాన్‌కు విశేష స్పందన లభించిందని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గడీల శ్రీకాంత్, చంద్రకాంత్, శ్రీనివాస్ రెడ్డి, జి. వెంకటేశం, మునరాశి రాములు, మురళీధర్ రెడ్డి, పల్నాటి శ్రీనివాస్, పులగూర్ల రాజేశ్వర్ రెడ్డి, వీరారెడ్డి, అనిల్ యాదవ్, గోవర్ధన్, పరశురాములు, బాలకిషన్, సుమలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# సిమెంట్ ట్రక్కు బోల్తా



**కొండపాక, జూలై 30( ప్రజా జ్యోతి):-** కొండపాక మండలం దుద్దెడ రాజీవ్ రహదారిలోని మూలమలుపు వద్ద గురువారం సిమెంట్ లోడుతో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న ట్రక్కు దుద్దెడ మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## సీనియర్ బాల్

# బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



**మిరుదొడ్డి, జూలై 30, (ప్రజాజ్యోతి):** ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక ఆగస్టు 2న హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ మైదానంలో ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. భైరయ్య తెలిపారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికకు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన క్రీడాకారులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లు ఆగస్టు 7 నుంచి 9 వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతితో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9440703038, 9704746511 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## కార్మికుల హక్కులు సంక్షేమం

# కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

### – డిమాండ్ల సాధన కోసం ఉద్యమశీ ఉధృతం

### – భవన నిర్మాణరంగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రశీ



**సిద్దిపేటఅర్బన్, జూలై 30 (ప్రజాజ్యోతి):-** రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగ కార్మికుల హక్కులు, సంక్షేమం, సామాజిక భద్రత కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణరంగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులతో భవిష్యత్ కార్యాచరణ హక్కుల సాధన పోరాటాలు



అంశాలపై గురువారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది డిమాండ్లతో కూడిన పోరాటాన్ని సాగిస్తే మూడు డిమాండ్లు పరిష్కారం అయ్యాయని మరో ఐదు డిమాండ్లు పెండింగ్ లో ఉన్నాయని వాటి పరిష్కారం కోసం ఉద్యమం ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 58 సంవత్సరాలు దాటిన కార్మికుల లేబర్ కార్డులను రద్దు చేయకుండా శాశ్వతంగా కొనసాగించాలని అన్నారు. 55 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ప్రతి నెల రూ.5,000 పెన్షన్ అందించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేసి కార్మికులకు ఈ.ఎస్.ఐ కార్డును అందించాలని అన్నారు.కార్మికుల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను మరింత బలోపేతం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుని డిప్యూటేషన్ను రద్దు చేయాలి

### – ప్రధాన ఉపాధ్యాయుని నిలదీసిన గ్రామస్తులు



**నంగునూరు జూలై 30 ప్రజా జ్యోతి ):-** మండల పరిధిలోని పాలమాకుల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రమణారెడ్డి డిప్యూటేషన్ రద్దు చేయాలని లేకుంటే ఆందోళన చేస్తామని గ్రామస్తుల హెచ్చరించారు ఉపాధ్యాయుల వర్గ పోరు లో విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు చక్కగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధిస్తున్న రమణ రెడ్డి ని బద్దిపడగ పాఠశాలకు డిప్టేషన్ వేయటం అక్కడ పనిచేస్తున్న యాదయ్య ఉపాధ్యాయుని పాలమాకులకు వేయడం సరికాదని డిప్యూటేషన్ ను రద్దు చేయాలని విద్యార్థులు చెప్పినప్పటికీ డిప్యూటేషన్ ఉత్తర్వులు రావడంతో రిలీవ్ చేయవద్దని గురువారం గ్రామస్తులు సర్పంచ్ ఓజాల్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాఠశాలకు వెళ్లి డిప్యూటేషన్ను రద్దు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రావును నిలదీశారు ఉపాధ్యాయులకు ఒకరికి ఒకరికి పడక ప్రధాన ఉపాధ్యాయునికి నచ్చని వారిని డిప్యూటేషన్ పై పంపించడం ఏమిటని ప్రధానోపాధ్యాయునిపై గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ విషయమై డీఈఓ కు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థుల కోరిక మేరకు డిప్యూటేషన్ ను రద్దు చేయాలని లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు.



## శ్రీ షిరిడీ సాయిబాబాకు పుష్పాభిషేకం

- ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు
- స్వామివారిని దర్శించుకున్న మునిసిపల్ చైర్ పర్సన్ దంపతులు





తాండూరు జులై 29 ప్రజా జ్యోతి : తాండూరు పట్టణ శివారులోగల శ్రీ షిరిడీ సాయి బాబా దేవాలయంలో జరిగిన పుష్పార్చన పూజ కార్యక్రమంలో తాందూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్‌రెడ్డి దంపతులు పాల్గొని సాయినాధులకి పుష్పాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ గురు పౌర్ణమిని పురస్కరించుకొని జరిగిన ఈ ఘనమైన పుష్పార్చన మహోత్సవంలో భాగంగా సాయి నాథున్ని దర్శించు కోవడం సంతోషకరమని అన్నారు. సాయిబాబా అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనేక మంది భక్తులు వివిధ రకాల పుష్పాలతో అభిషేకం చేయడం ఎంతో అద్భుతమైన కార్యమన్నారు. సాయినాథుని దివ్య ఆశీస్సులు తాండూర్ పట్టణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ కూడ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు" తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి..గురువును కాదు..

### గురుతత్వాన్ని ఆరాధించే మహా పర్వం

- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ
- శ్రీ శ్రీ హరి ప్రకాష్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్న సత్యనారాయణ





కొత్తూర్ జులై 29 (ప్రజా జ్యోతి) : గురు పౌర్ణమి..గురువును కాదు.. గురుతత్వాన్ని ఆరాధించే మహా పర్వం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ లోని 1008మహామండస్వర్ ప్రంపూజయ గురువారర్ స్వామి శ్రీ శ్రీ హరిప్రకాష్ మహారాజ్ జీ గారి ఆశీర్వాదం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ పొందారు.

## వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరియు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కలిసి దిగిన అరుదైన ఫోటోతో రూపొందించిన ఫ్రేమ్‌ను ఆయనకు జ్ఞాపికగా బహుకరించారు. ఆ ఫోటోను ఆసక్తిగా పరిశీలించిన జగన్ మోహన్ రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, జ్ఞాపికను అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తెలంగాణ సాయి మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మ బస్తీలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మ బస్తిలో 30 లక్షలు రూపాయలు చేపట్టిన అభివృద్ధి పనులు వాటర్ పైప్ లైన్, భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం స్థానిక నాయకుల తో కలసి మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

తను కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటినుండి డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేశానని పేర్కొన్నారు. తన పదవీకాలం ముగిసినప్పటికీ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు డిఈ సంధ్య, ఎఈలు అభిరామ్, ఆశ, మాజీ డివిజన్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మహేందర్, వినయ్, హనుమంతు, బ్రహ్మానంద చారి, ముంతాజ్, యాదగిరి, మనోజ్, ఖలీల్, అంజన్ యాదవ్, గోరేమియా, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు అంతా సహకరించాలి

కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ చింత సాయి తేజశ్వర్



కొత్తూర్ జులై 29 (ప్రజాజ్యోతి) : ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు అంతా సహకరించాలని కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ చింత సాయి తేజశ్వర్ చెప్పారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా బుధవారం కొత్తూరు పాత మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ చింత సాయి తేజశ్వర్ ఇంటింటా తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఓటర్లు ఫారాలను ఎలా నింపాలో తెలియజేస్తూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనర్హులు ఎవరు ఓటరు జాబితాలో నమోదు కాకుండా అర్హులంతా నమోదయ్యేలా అర్హులు ఎవరు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా సర్ ప్రక్రియ దోదపడుతుందన్నారు. ఫారాలను సేకరించడానికి బిఎల్వోలు ఇళ్లను సందర్శిస్తారని చెప్పారు. రెండు పారాలలో బిఎల్వో లు ఒక ఫారాన్ని ఓటర్ల వద్దే ఉంచి మరోపారాన్ని సేకరిస్తారని ఆయన చెప్పారు. ఈ బిఎల్వోలు కడెం పల్లి సుమిత్ర, వడ్ల అనిత,అరుంధ,ప్రవీణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# దైవ దర్శనాలకు ప్రత్యేక బస్సులు

- అరుణాచలం యాత్రకు శ్రీకారం
- వచ్చేనెల 3 నుండి ఐదు వరకు విహార యాత్ర
- ఆషాడ మాసంలో భక్తులకు దైవ దర్శనం కోసం టూరు
- వెల్లడించిన తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్






తాండూరు జులై 29 ప్రజా జ్యోతి :

తాండూర్ బస్ డిపో నుండి అరుణాచలం దైవ దర్శనం కోసం ప్రత్యేక టూర్ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తాండూర్ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్టిసి) ద్వారా ప్రత్యేక యాత్రకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇట్టి యాత్రకు బయలుదేరె భక్తులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం 3ఆగస్టు 2026 నుండి ఆగస్టు 5 వరకు తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. అరుణాచలం ఆధ్యాత్మిక టూర్ ఆర్టీసీ కోసం డీలక్స్ బస్సులో మూడు రోజుల పాటు యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో ముఖ్యంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం (కాణిపాకం), శ్రీ లక్ష్మీ నారాయణ గోల్డెన్ టెంపుల్ (వెల్లూరు), శ్రీ అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం (తిరువణ్ణామలై) లో దర్శించడంతో పాటు అరుణాచల గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ అధికారులు నిర్ణయించిన మేరకు వచ్చే సోమవారం రాత్రి 9 గంటలకు తాండూర్ నుండి బయలుదేరి, 05 ఆగస్టు 2026 బుధవారం సాయంత్రం 5 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి మరుసటి రోజు గురువారం ఉదయం వరకు తిరిగి తాండూర్ చేరుకుంటుందన్నారు. ఇట్టి ఆధ్యాత్మిక దర్శనానికి వెళ్లే భక్తులు ఆర్టీసీ నిర్ణయించిన మేరకు పెద్దలకు రూ 3వేల 600లు కాగా ఆఫ్ టికెట్ రూ 2 వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ యాత్రలో భాగంగా దర్శనం, భోజనం, ఇతర వసతి ఖర్చులు అన్ని కూడ భక్తులే స్వయంగా భరించవలెనని చెప్పారు. ఆసక్తి గల భక్తులు తమ సీట్లను ముందుగానే రిజర్వు చేసుకోవాలని తాండూర్ డిపో మేనేజర్ కోరారు. బుకింగ్ కోసం సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు హుస్సేన్ ఎడిసి 9948947422 నవీన్ గౌడ్, సిస్టం సూపర్వైజర్ 8309348157లకు సంప్రదించాలని కోరారు.

# వానాకాలంలోనూ కరెంటు కష్టాలు





- రేవంత్ పాలన పూర్తిగా విఫలం
- మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్

వికారాబాద్ ప్రతినిధి, జూలై 29(ప్రజాజ్యోతి) : రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన పూర్తిగా విఫలమైందని, వానాకాలంలో కూడా ప్రజలు కరెంటు కష్టాలతో అల్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తీవ్రంగా మండిపడ్డారు. బంట్వారం మండలం రొంపల్లి, మంగ్రాస్‌పల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరా ఆదర్శంగా నిలిచిందని, ఎండాకాలంలో కూడా కరెంటు కోతలు లేకుండా ప్రజలకు సేవలు అందాయని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం వానాకాలంలోనే విద్యుత్ అంతరాయాలు సాధారణమైపోయాయని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మిషన్ భగీరథ వంటి కీలక పథకాలను సైతం నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గతంలో విజయవంతంగా అమలైన సంక్షేమ పథకాలు ఇప్పుడు కుంటుపడుతున్నాయని అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య చురుకుగా పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ బలం కార్యకర్తలేనని, ప్రతి ఇంటికీ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలు









- వెంటనే చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు : బీఆర్ఎస్ నాయకులు

పరిగి, జూలై 29 (ప్రజాజ్యోతి) : పరిగి పట్టణంలో నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలను అరికట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరిగి వ్యవసాయ అధికారికి, పరిగి సబ్ ఇన్‌స్పెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం రైతులకు అవసరమైన డీఏపీ ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఎరువుల కొరత ఏర్పడి, దానిని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు నకిలీ డీఏపీ ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారు

రైతులు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేస్తున్న ఎరువులు నకిలీవని తెలిసి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, దీనివల్ల పంటల దిగుబడి దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. నకిలీ ఎరువుల తయారీ, నిల్వ, విక్రయాల్లో పాల్గొంటున్న వారిని వెంటనే గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా రైతులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యపై స్పందించకపోవడం దురదృష్టకరమని, ప్రజాప్రతినిధిగా రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యతను విస్మరించారని విమర్శించారు.

వ్యవసాయ శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలను వెంటనే అరికట్టాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు డీఏపీ ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు, నకిలీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపిపి అరవింద్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్లు, మీర్ తాహేర్ అలీ, శివనోళ్ళ భాస్కర్, మాదారం సర్పంచ్ రాములు, ఆసిఫ్ తోపాటు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పథంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం

93 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం డివిజన్ లోని రొడా మేస్త్రి నగర్ లో రూ.31 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, అలాగే సుభాష్ చంద్రబోస్ నగర్--ఏలో సుమారు రూ.62 లక్షల వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, ముఖ్యంగా వర్షాకాలంలో కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, జాకీర్ బలరాం, మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మహిళా నాయకురాలు పద్మ, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్, రషీద్ బేగ్, సలీం, దుర్గేష్, నరేందర్, నాగేందర్, నబి, కొండయ్య, ఆనంద్, రాజు, కిషన్, నీలి శ్రీను, ఆబేద్, ఉస్మాన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు

## హైడ్రా పై రాజకీయాలు తగదు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : హైడ్రాధికారి రంగనాథ్ కమిషనర్ పదవి నుండి తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును నాణెంకు ఒకవైపు చూసి దాన్నే ఎత్తిచూపడం వల్ల గత ప్రభుత్వంలో జరిగిన కబ్జాలు ఎటుపోవని కాబట్టి హైకోర్ట్ తీర్పును రాజకీయం చేయవద్దని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పత్రిక ప్రకటనను విడుదల చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు కుంటలు ప్రభుత్వ భూములు రక్షణ కొరకు ఏర్పడ్డ హైడ్రా కొద్ది రోజులలోనే అనేక మంచి మరియు ప్రజలకు నష్టం కలిగించే చర్యలు కూడా తీసుకున్నప్పటికీ వీటివల్ల ఎక్కువగా నష్టపోయింది కబ్జాదారులు మాత్రమేనని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఏ నియోజకవర్గంలో చూసిన కుంటలు చెరువులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి ఏదో మధ్యతరగతి ప్రజలను మోసం చేశారని ఆ విషయాన్ని హైడ్రా వచ్చాక అనేక కూల్చివేతల వల్ల కబ్జాదారులకు నష్టం వాటిల్లడం వల్లనే కోర్టులకు పోయి అబద్ధపు సమాచారాన్ని ఇచ్చి వారి కబ్జాలను కాపాడుకుంటున్నారని అంతేకానీ పేద ప్రజలు హైడ్రాకి వ్యతిరేకంగా కోర్టుకు పోయిన సందర్భాలు చాలా తక్కువ అని కాబట్టి హైడ్రా లేక హైడ్రాధికారి రంగనాథ్ చర్యలు కబ్జాదారులకు నష్టమని అన్నారు. సిపిఐ గా కూడా హైడ్రా పై భిన్నభిప్రాయాలు ఉన్నప్పటికీ చెరువులు కుంటలు అభివృద్ధి విషయంలో హైడ్రాకు మద్దతిస్తూనే, పరికి చెరువు లో జరిగిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో హైడ్రా రంగనాథ్ విఫలమయ్యారని ఇటువంటి విషయంలో హైడ్రాను తప్పుపట్టుతున్నామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో పక్షపాత,సొంత రాజకీయ నాయకుల అభిప్రాయాలను పరిగనణలోకి తీసుకోని హైడ్రా ను సొంత సంస్థ లాగా ఉపయోగించుకోవడం వల్లే నేడు హైకోర్టు ఇచ్చిన తీర్పుకు కారణమని కావున రేవంత్ రెడ్డి నిష్పాక్షపాతంగా వ్యవహరించి గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

## వచ్చే నెల 5న చలో వికారాబాద్

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు యం రమేష్ ను కలిసిన జేఏసీ నాయకుడు
- బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ సదస్సుకు రావాలని ఆహ్వానం
- వికారాబాద్ రానున్న డాక్టర్ విశారదన్ మహారాజ్



తాండూరు జులై 29 ప్రజా జ్యోతి : వచ్చే నెల 5న వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే బీసీ, ఎస్సీ, ఎస్టీ జెఏసి సదస్సుకు తాండూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మల్కూడ్ రమేష్ మహారాజ్‌ను కలిసిన బీసీ, ఎస్సీ,ఎస్టీ జేఏసి జిల్లా ఇన్చార్జి శ్రీనివాస్ ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 5న వికారాబాద్ జిల్లా ఎన్నెపల్లి లో గల గుప్త చాయ ఏసీ బంక్వేడ్ హాల్ నందు జరుప తలపెట్టిన బిసి,ఎస్సీ,ఎస్టీ, జేఏసీ వికారాబాద్ జిల్లా ఆవిర్భావ సదస్సుకు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథిగా రానున్నట్లు చెప్పారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన విద్యావంతులు యువకులు మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, శేఖర్, నర్సింలు, శివకుమార్ ముదిరాజ్‌లు ఉన్నారు.

## రాజీవ్, ఇందిరమ్మ కాలనీల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

- వాహనాల రాకపోకలతో ప్రయాణికులు, విద్యార్థులకు ఇబ్బందులు
- రెండు వైపులా బస్ స్టాఫ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికుల విన్నపం



తాండూరు జులై 29 ప్రజా జ్యోతి : వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ సమీపంలోని రాజీవ్, ఇందిరమ్మ కాలనీల వద్ద ప్రణికులు,విద్యార్థుల సౌకర్యార్థం బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని స్థానిక కాలనీలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. తాండూరు, హైదరాబాదు ప్రధాన రోడ్డు మార్గం కావడంతో వాహనాల రద్దీ కూడ అధికంగా ఉంటుందని చెప్పారు. ఇందిరమ్మ, రాజీవ్ కాలనీ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించే వందలాది మంది విద్యార్థులతో పాటు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు స్పందించి రెండు వైపులా కూడ ఆర్టీసీ బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా వాహనాల రాక పోకలలో వేగాన్ని నియంత్రించే విధంగా స్పీడ్ బ్రేకర్లు గాని నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన స్వీట్స్ అందించాలి

- మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్
- చేగూర్‌లో జై బాలాజీ రామ్ లాల్ స్వీట్ హౌస్ ప్రారంభం
- ప్రోపరేటర్ అరవింద్ మీర్జాకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన దేవేందర్ యాదవ్,కోస్గి శ్రీనివాస్



కొత్తూర్ జులై 29 (ప్రజా జ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన స్వీట్స్ అందించాలని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. బుధవారం నందిగామ మండలంలోని చేగూర్ లో జై బాలాజీ రామ్ లాల్ స్వీట్ హౌస్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ హాజరై ప్రోపరేటర్ అరవింద్ మీర్జా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారులకు మంచి స్వీట్స్ అందిస్తే వ్యాపారంలో రాణించవచ్చని వారు సూచించారు.

## అభివృద్ధికి వారధులు... ప్రధాన రహదారులు

- 62.00 లక్షలతో నూతన నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజాజ్యోతి) : 126జగద్గిరిగుట్ట డివిజన్ పైప్ లైన్ రోడ్డులోని 62.00 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అభివృద్ధికి వారధులు, ప్రధాన రహదారులని అన్నారు. గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా ప్రజల సౌకర్యార్థం మరిన్ని రహదారులను మెరుగు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సంధ్య, ఏఈ లు ఆశా, అభిరామ్, మాజీ కార్పొరేటర్ జగన్, వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్, కిషోర్, నాయకులు బస్వరాజ్, మెట్ల శ్రీను, బ్రహ్మానంద చారి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి

## ప్రభుత్వాలు మారినా.. మారని ఆసుపత్రి దుస్థితి

కాల్వ శ్రీరాంపూర్, జూలై 30 (ప్రజా జ్యోతి):
కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రి శిథిలావస్థకు చేరడంతో రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 60 ఏళ్ల క్రితం కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రి ప్రస్తుతం మరమ్మతులకు నోచుకోక దయనీయ పరిస్థితికి చేరింది.వర్షాకాలంలో ఆసుపత్రి పైకప్పు నుంచి నీరు కారి రోగుల బెడ్లపై పడుతుండగా, వార్డులన్నీ నీటితో నిండిపోతున్నాయి. దీంతో రోగులు






భయాందోళనల మధ్య చికిత్స పొందాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండాకాలంలో పైకప్పు పెచ్చులు ఊడిపడే ప్రమాదం ఉండడంతో వైద్యులు, సిబ్బంది కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పేరుకు 30 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికీ, సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు వైద్యం కోసం పెద్దపల్లి, కరీంనగర్ పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ఈ ఆసుపత్రి దుస్థితి మాత్రం మారలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనానికి బదులుగా నూతన ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# వర్షాల నేపథ్యంలో అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌లోని 40 మంది వృద్ధులకు వర్షపు కవర్లు అందజేసిన కుర్ర ధరణి

ముస్తాబాద్, జూలై 30: ( ప్రజా జ్యోతి ):
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలోని అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న 40 మంది వృద్ధులకు వర్షాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కుర్ర సావిత్రి, దేవయ్య దంపతుల కుమార్తె కుర్ర ధరణి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి వృద్ధులకు వర్షపు కవర్లను అందజేశారు. ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి వర్షాల వల్ల వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలుసుకున్న ధరణి, వారి అవసరాన్ని గుర్తించి వెంటనే స్పందించారు. వృద్ధులు వర్షంలో తడవకుండా, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఉపయోగపడే విధంగా 40 మందికి సరిపడా వర్షపు కవర్లను అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కుర్ర ధరణి మాట్లాడుతూ, సమాజానికి ఎంతో సేవ చేసిన పెద్దలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వృద్ధుల అవసరాలను గుర్తించి వారికి తోడుగా నిలవడం ద్వారా నిజమైన సామాజిక సేవ చేయవచ్చని పేర్కొన్నారు. చిన్న సహాయం అయినా అవసరమైన సమయంలో అందిస్తే అది వారికి ఎంతో ధైర్యాన్ని, భరోసాను కలిగిస్తుందని చెప్పారు. అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధుల సంక్షేమం కోసం అనేక మంది దాతలు సహకరిస్తున్నారని, అదే స్ఫూర్తితో కుర్ర ధరణి ముందుకు వచ్చి వర్షపు కవర్లు అందించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. వర్షాకాలంలో ఈ కవర్లు వృద్ధులకు ఎంతో ఉపయోగపడతాయని, వారి ఆరోగ్య పరిరక్షణకు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు కుర్ర ధరణికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆమెకు మరింత సేవా స్ఫూర్తి కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో సేవా కార్యక్రమాలకు యువత ముందుకు రావడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని కుర్ర ధరణి సేవా కార్యక్రమాన్ని అభినందించారు.



# గ్రామాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు చేయడం అభినందనీయం

## సర్పంచ్ ఓల్లాల రజిత వెంకటేష్

ఇల్లంతకుంట జూలై 30 (ప్రజజ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం రోజు కాత్యాయని కంటి హాస్పిటల్ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది ప్రజలు కంటి పరీక్షలు చేసుకోగా అవసమైన వారికీ మందులు, కంటి అద్దాలు హాస్పిటల్ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రజిత వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు కాత్యాయని హాస్పిటల్ వారు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని, వారికి గ్రామ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాత్యాయని హాస్పిటల్ వైద్యులు సింగ్, లత శ్రీనివాస్ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నేతన్నల సంక్షేమా నికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రూ.3.22 కోట్లతో రగుడు జంక్షన్ అభివృద్ధి పనుల ప్రారంభం
- నేత కార్మికులకు ఆర్డీ పాస్‌బుక్‌ల పంపిణీ

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి):
సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఇంచార్జి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3.22 కోట్లతో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ, మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ సిరిసిల్ల చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత రెండేళ్లలో చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. ఏడాది పొడవునా ఉపాధి కల్పించడంతో పాటు భీమా, సంక్షేమ



పథకాల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం నాణ్యమైన చీరలను కొనుగోలు చేస్తోందని, యార్న్ డిపో ఏర్పాటు ద్వారా సహకార సంఘాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ముఖ్యంగా సిరిసిల్ల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, నేతన్నల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు.రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని తెలిపారు. సిరిసిల్ల చీరలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు జీఐ ట్యాగ్ సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. నేతన్నలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ



ప్రభుత్వం వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా చెల్లించి నేతన్నల్లో విశ్వాసం పెంచిందన్నారు.
గత ఆర్థిక సంవత్సరంలో 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కోటి మీటర్ల ఉత్పత్తి పూర్తయిందని, రూ.62 కోట్ల బిల్లులను చెల్లించామని చెప్పారు. రూ.50 కోట్లతో యార్న్ బ్యాంక్, కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుతో పాటు రగుడు జంక్షన్‌ను నేతన్నల వృత్తి ప్రతిబింబించేలా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గుడి చెరువు బండ్ పార్క్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామని తెలిపారు.
రగుడు బైపాస్ జంక్షన్‌ను వస్త్ర తయారీ వివిధ దశలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దామని చెప్పారు. గత ఏడాది జిల్లాలో తయారైన ఇందిరా మహిళా శక్తి చీరలకు విశేష ఆదరణ లభించిందని, ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చిందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కరీంనగర్ కలెక్టరేట్,జూలై 30 (ప్రజాజ్యోతి)
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు.ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు జూలై 29, 30 తేదీల్లో కరీంనగర్‌లోని ముకుంద్ లాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా హాజరైన రజనీకాంత్, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ వాటి పరిష్కారంపై ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు.రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఎలాంటి ఆంక్షలు లేకుండా అవసరమైన విద్యా సర్టిఫికెట్లు అందించాలని, డీబీటీ విధానం ద్వారా స్కాలర్‌షిప్‌లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టత లేదని అన్నారు.
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థలు పలు సమస్యలతో కొనసాగుతున్నాయని, అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు.
గురుకులాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
విద్యార్థులకు ఉదయం టిఫిన్ పథకాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆగస్టు 6న నిర్వహించే మహాధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిక్, శ్రీకాంత్, మమత, సహాయ కార్యదర్శులు రాజు, భరత్, రమ్య, దీపిక, నాయకులు నరేష్, లెనిన్, అరవింద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# వర్షాలకు జలమయమైన కొత్తపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి

## రాకపోకలకు తీవ్ర అంతరాయం

### శాశ్వత పరిష్కారానికి ఆర్‌ఓబీ నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి

పెద్దపల్లి, ప్రతినిధి జూలై 30 ప్రజాజ్యోతి:
గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. దీంతో వాహనాలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సికింద్రాబాద్–న్యూఢిల్లీ ప్రధాన రైల్వే మార్గంలోని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గతంలో అనేక చోట్ల రైల్వే గేట్లను తొలగించి వాటి స్థానంలో అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. అయితే వర్షాకాలం ప్రారంభమైన ప్రతిసారీ ఈ అండర్ బ్రిడ్జిల్లో భారీగా వర్షపు నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.



ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక అంశాలు, వర్షపు నీటి పారుదల, డ్రైనేజీ వ్యవస్థ, భౌగోళిక పరిస్థితులు వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అండర్ బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తగిన ప్రణాళిక లేకపోవడంతో వర్షాకాలంలో అవి నీటితో నిండిపోయి ప్రయాణానికి అనర్థంగా మారుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొత్తపల్లి అండర్ బ్రిడ్జిలో వరద నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, అత్యవసర సేవలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీ) నిర్మాణాన్ని ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట్ల ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడంతో పాటు ఇప్పటికే ఉన్న అండర్ బ్రిడ్జిల వద్ద శక్తివంతమైన నీటి పారుదల వ్యవస్థ, పంపింగ్ సదుపాయాలు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
ఇప్పటికైనా దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి కొత్తపల్లి అండర్ బ్రిడ్జి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# కరీంనగర్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల ప్రారంభం

కరీంనగర్ బ్యూరో,జూలై 30 (ప్రజాజ్యోతి):
కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు కొత్తపల్లి హవేలీ రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నట్లు మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,



రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణించారు. మొదటి దశలో కరీంనగర్–వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్–చింతకుంట, కరీంనగర్–కరీంనగర్ నగరంలో చాలా కాలంగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను నెరవేర్చామని చెప్పారు. నగర విస్తరణకు అనుగుణంగా ప్రజా రవాణాను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ఈ సర్వీసులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.చింతకుంట, ఒద్యారం, కొత్తపల్లి ప్రాంతాలతో పాటు విద్యాసంస్థలకు కేంద్రంగా ఉన్న వాగేశ్వరి వైపు సిటీ బస్సులను నడుపుతున్నామని తెలిపారు. త్వరలో ప్రతిమ, చల్మెడ, మానకొండూరు వైపు కూడా బస్సు సర్వీసులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రయాణికుల ఆదరణను బట్టి అవసరమైతే 24 గంటలపాటు సర్వీసులు నడిపే దిశగా చర్యలు తీసుకుంటామని, రద్దీ ఉన్న మార్గాల్లో అదనపు బస్సులను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూట్లలో ఆర్టీసీ బస్సులను ప్రవేశపెడుతున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని విస్తృతంగా వినియోగించుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు పెండింగ్ బకాయిలను కూడా చెల్లించామని తెలిపారు.
ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం ఆర్టీసీ రోజుకు సుమారు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తోందని మంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దశాబ్ద కాలంగా తాత్కాలిక మరమ్మతులే.. శాశ్వత వంతెన ఎప్పుడు?...

కోనరావుపేట,జూలై.30(ప్రజాజ్యోతి)
కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని మూలవాగుపై ఉన్న వంతెన మరోసారి వర్షాలకు దెబ్బతింది. దశాబ్ద కాలంగా వర్షం వచ్చినప్పుడల్లా రహదారి కొట్టుకుపోవడం, తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత వంతెన నిర్మిస్తామని అధికారులు, ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. దీంతో మండల కేంద్రానికి రాకపోకలు తీవ్రంగా ఇబ్బందిగా మారుతున్నాయని, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు.



# భీమేశ్వరస్వామిఆలయంలో మంత్రి పొన్నం పూజలు

వేములవాడ,జులై,30:ప్రజాజ్యోతి.
జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆలయంలోకి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, విప్ పూజలు చేశారు.



## మానవ అక్రమ రవాణాను అరికడదాం.. మహిళలు, పిల్లలను రక్షిద్దాం..
– ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి



**చింతకాని జూలై30(ప్రజా జ్యోతి )** మానవ అక్రమ రవాణాను అరికడదాం మహిళలు, పిల్లలను రక్షిద్దాం అని ఐ సి డి ఎస్ చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. గురువారం చింతకాని మండల పరిధిలోని నేరడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ రాయల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ సంధ్యారాణి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని,నమ్మి మోసపోకూడదని అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులను గుర్తించినట్లయితే హెల్ప్ లైన్ కు1098, మహిళల హక్కులకు భంగం కలిగినట్లయితే 181 కి, అత్యవసర పరిస్థితి ఏర్పడితే 122కు, పోలీస్ శాఖ సేవలు అవసరమైతే 100కు, సైబర్ క్రైమ్ బాధితులు 1930 హెల్ప్ లైన్ కు ఆలస్యం చేయకుండా వెంటనే ఫోన్ చేసి, రక్షణ పొందాలని సూచించారు. అంగనవాడి టీచర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విసిపిసి కమిటీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉప సర్పంచ్ కోట ముత్తయ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా గ్రామంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా మా దృష్టికి తీసుకువస్తే పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాల రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సరోజిని,వెంకమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### జిల్లా కరగరని సందర్శించిన జిల్లా
## న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస జిల్లా కారాగారాన్ని సందర్శించి జైలు పరిసరాలు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ ట్రయల్ ఖైదీలతో (యు టి పి ఎస్ ) మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులైన పేద అండర్ ట్రయల్ ఖైదీలు తప్పనిసరిగా జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి అర్హుడికి రాజ్యాంగబద్ధంగా ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందని, న్యాయవాది నియామకం, న్యాయ సలహా తదితర సేవలు డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా అందించబడుతున్నాయని వివరించారు. ఖైదీల హక్కుల పరిరక్షణతో పాటు, న్యాయం అందరికీ చేరువ చేయడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా కారాగార సూపరింటెండెంట్ శ్రీధర్ జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభ్యున్నతికి గ్రామ సమాఖ్య భవనాలు వేదిక కావాలి



**నేలకొండపల్లి, జులై 30 ప్రజా జ్యోతి :** గ్రామ సమాఖ్య భవనాలు మహిళల అభ్యున్నతి కి వేదికలు కావాలని తిరుమలాపురం పంచాయతీ సర్పంచ్ కమదన ప్రవీణ్ సూచించారు. మండలం లోని తిరుమలాపురం లో నూతనంగా నిర్మించనున్న గ్రామ సమాఖ్య భవనం కు గురువారం శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు... గ్రామాభివృద్ధి కి రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. పాలకవర్గం, గ్రామ పెద్దల సహాకారంతో గ్రామ పంచాయతీలో దశల వారీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో నిర్మించే గ్రామ సమాఖ్య భవనాలు వారి ఆర్థికాభివృద్ధి పెంచేందుకు దోహాదపడాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆంటోని, పంచాయతీ వార్డు సభ్యులు విజయబాబు, రమాదేవి, కీర్తన, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### రఘునాథపాలెం సర్వే నెం.218
## పట్టాదారులకు న్యాయం చేయాలి
– బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన
ఖమ్మం నగర బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు





**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** 2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో ఖమ్మం పట్టణంలో 3000 వేల మంది పేదలకు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించకుండా చేతులు దులుపుకున్నారు స్థలాల కోసం పండితులు తిరగని ఆఫీస్ లేదు కానీ టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కెసిఆర్ ముఖ్యమంత్రి ఐన నతరువాత రఘునాథపాలెం గ్రామం, సర్వే నెం.218లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పేదలకు పంపిణీ చేసిన 650 పట్టాదారుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నగర బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలపై ప్రస్తుతం అమరావతి--హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, మోడల్ స్కూల్ నిర్మాణం పేరుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా సుమారు 300 మంది పట్టాదారులు తమ ఇళ్ల నిర్మాణంపై తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, అయితే పేదల హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు నష్టం కలగకుండా సముచిత న్యాయం చేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి వారి హక్కులను కాపాడాలని కోరారు. అదేవిధంగా, అమరావతి--హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో ప్రభావితమవుతున్న పట్టాదారులకు తక్షణమే పరిష్కారం చూపాలని, మిగిలిన పట్టాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం సర్వే నెం.218 పట్టాదారులు, బాధిత కుటుంబాలు, బీఆర్ఎస్ నాయకులుమాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి పొదిల నాగరాజు పాల్గొన్నారు.

## నిర్ణిత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
– జిల్లాలో అత్యాధునిక సదుపాయాలతో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం
– రఘునాథపాలెం లోని స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నెలరోజుల లోపు అందుబాటులోకి రావాలి
– విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన









**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం వైఎస్ఆర్ నగర్ ప్రధాన దారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాక్‌లు, డార్మిటరీ భవనం, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌలిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రఘునాథపాలెం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (బాలుర) గురుకుల పాఠశాల/కళాశాల భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. నెలరోజుల లోపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పొంగులేటి
– రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు – ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి
– సీతారామ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు









**అన్నపురెడ్డిపల్లి, జూలై 30 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ఉ ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రూ.2.77 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. అనంతరం వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా గుంపెన గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నరసాపురం గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. భీమునిగూడెం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కోండాయిగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంటలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం పెద్దిరెడ్డిగూడెం, గుంపెన, భీమునిగూడెం, నరసాపురం, ఊటుపల్లి, రంగాపురం గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత, రైతుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు వంటి మౌలిక వసతులను బలోపేతం చేస్తూ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని వారం రోజుల్లో పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, హౌసింగ్ శాఖ అధికారులు, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 2025 కిష్టారం ఓసి కి ద్వితీయ బహుమతి
– ఘనంగా 56వ వార్షిక భద్రత పక్షోత్సవం




**సత్తుపల్లి జూలై30(ప్రజా జ్యోతి)** సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం--2025 లో భాగంగా సత్తుపల్లి ఏరియా లోని కిష్టారం ఓసి ప్రాజెక్టు కి గ్రూప్ -- ××× ఓసీ గనుల విభాగంలో ఓవరాల్ పర్ఫార్మన్స్ లో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ ఎల్ ఎస్ వి సునీల్ వర్మ ఆధ్వర్యంలో కిష్టారం ఓసి నందు అభినందన సభ గురువారం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి మరియు మైన్ మేనేజర్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ విజయం సాధించడంలో కృషి చేసిన ప్రతి ఉద్యోగిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సురక్షితమైన పని వాతావరణాన్ని కొనసాగించాలని ప్రోత్సహించారు. అనంతరం, మిఠాయిలను ఉద్యోగులకు పంపిణీ చేసి, ఈ విజయాన్ని సంతోషంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కిష్టారం ఓ సి గని మేనేజర్ బి రామకృష్ణ, అడిషనల్ మేనేజర్ వల్లమల్ల బాబు, సేఫ్టీ ఆఫీసర్ గోపి కిశోర్ , ఏఐటియుసి పిట్ సెక్రెటరీ కిశోర్ కుమార్, ఐ ఎన్ టి యు సి పిట్ సెక్రెటరీ షణముక చారి, ఇతర అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు మరియు డి ఎల్ ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

### విలేకరి తోట మల్లయ్యను
## పరామర్శించిన ఎమ్మెల్యే జారే



**దమ్మపేట,జూలై.30,(ప్రజాజ్యోతి ):** ఇటీవల మరణించిన ప్రముఖ విలేకరి తోట మల్లయ్య తండ్రి తోట పొట్టియ్య చిత్రపటానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం తోట మల్లయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొట్టియ్య ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, గుర్రం మల్లేశ్, చిన్నశెట్టి గోపి, పిట్ల శీను, గట్ల నాగరాజు, అయ్యప్ప, జెట్టి వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు కు పోటేత్తిన వరద నీరు

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 30, (ప్రజా జ్యోతి)
గత మూడు రోజులుగా ఎ డ తెరిపి లేకుండా కురుస్తు న్న భారీ వర్షాలకు ఎగువ ప రివాహక ప్రాంతాల్లో కురు స్తున్న భారీ నుండి అతిభారీ వర్షాలతో నిర్మల్ జిల్లాలోని (కడం) నారాయణరెడ్డి ప్రా జెక్టుకు భారీగా వరద పోటె త్తుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు లోకి 11,890 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోం ది. దీంతో ప్రాజెక్టు నీటిమ ట్టం 684.100 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థా యి నీటిమట్టం 700 అడు గులు ప్రస్తుత నీటి నిల్వ 0.889 టీఎంసీ లు. వరద ప్రవాహం మరింత పెరిగే అ వకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అ ధికారులు హెచ్చరించారు. ప్రాజెక్టు దిగువన గల గోదా వరి నది పరివాహక ప్రాం తాల్లో నివసించే ప్రజలు, రై తులు, మత్స్యకారులు, గొ ర్రెల కాపరులు, పల్లెకారులు నది ఒడ్డుకు, నది ప్రవాహక ప్రాంతాలకు వెళ్లవద్దని ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అధి కారులు పరిస్థితిని ఎప్పటిక ప్పుడు పర్యవేక్షిస్తున్నారని, అవసర మైతే గేట్లు ఎత్తి నీ టిని దిగువకు విడుదల చే స్తామని తెలిపారు.

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

మొదటిపేజీ తరువాయి..

ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷-లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు. ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని వ్యాఖ్యానించారు.

## విద్యార్థులపై కాల్పులు జరిపించింది హోంమంత్రే

మొదటిపేజీ తరువాయి..

వచ్చి కూర్చునే ధైర్యం లేదు. నేను ఆయన వాహనశ్రేణిని చూశాను. అందులో 30 వాహనాలు ఉన్నాయి. కానీ హోం మంత్రి భయపడుతున్నారు, అందుకే ఆయన ఈరోజు ఇక్కడ లేరు. పిల్లలపై పెల్లెట్లు ప్రయోగించారు. పిల్లలకు షాక్ ఇవ్వాలని ఆయన (హోం మంత్రి అమిత్ షా) ఆదేశించారు." "అంతా ప్రైవేటీకరించారు. వ్యవస్థ ఆత్మను స్వాధీనం చేసుకున్నారు. దాన్ని ఆర్ఎస్ఎస్ ఆక్రమించుకుంది. ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పుడూ విద్యా మంత్రిత్వ శాఖను నడపలేదు. దానిని నడిపే వ్యక్తి, సంస్థ ఆర్ఎస్ఎస్. మంత్రి కార్యాలయంలో కూర్చునే ఓఎస్డీయే దానిని నడిపే వ్యక్తి. దేశంలోని ప్రతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఒక ఆర్ఎస్ఎస్ మనిషే. నిజమైన శత్రువు ఆర్ఎస్ఎస్, ధర్మేంద్ర ప్రధాన్ కాదు." విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని రాహుల్ గాంధీ సమర్థించారు. సభలో ఈ విషయంపై మాట్లాడుతూ ఇలా అన్నారు, "ఒక విద్యార్థి నిజం చెప్పడానికి భయపడడు. ఒక విద్యార్థి ఎవరిపైనా బల ప్రయోగం చేయడు. ఎదుటి వ్యక్తి అభిప్రాయం తన అభిప్రాయానికి భిన్నమైందని వారికి తెలుసు. దీనికి పూర్తిగా వ్యతిరేకంగా మరో వర్గం ఉంది. ఆ వర్గం వారు నిజాలను చెప్పరు. వారికి హింస అంటే ఇష్టం. వారికి అధికారం అంటే ఇష్టం. విద్యా వ్యవస్థ పట్ల విద్యార్థులు చాలా అసంతృప్తిగా ఉన్నారు. కొంతమంది ధనవంతులు పత్రికలను కొనుక్కున్నారు. పేదవారు, నిజాయితీపరులు బాధపడుతున్నారు." అని ఆరోపించారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో విద్యార్థుల నిరసనలను యువత భావ వ్యక్తీకరణగా అభివర్ణించారు. వారి ఆగ్రహం సమర్థనీయమైందని నొక్కి చెప్పారు. అయితే, అధికార పార్టీ ఆయన ప్రసంగానికి పదే పదే అంతరాయం కలిగించడంతో, బిల్లుపై దృష్టి కేంద్రీకరించాలని స్పీకర్ ఆయనకు సూచించారు. రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలలో అపార్లమెంటరీ భాషను ఉపయోగించడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఇది కోపం కాదు, హింస కాదు, ద్వేషం కూడా కాదు. ఇది దేశ యువత, రాబోయే తరం భావవ్యక్తీకరణ. బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు ఈ భావనను గౌరవించాలి." అని రాహుల్ అన్నారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు తమ పిల్లల అభిప్రాయాలను అడిగితే, వారికి కూడా విద్యార్థుల నుంచి మద్దతు లభిస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది పిల్లలతో తాను మాట్లాడానని, వారు తమ ఆలోచనలు తెలియజేశారని రాహుల్ చెప్పారు. ఈ సందర్భంగా ఒక అమ్మాయిని, "విద్యార్థిగా ఉండటం అంటే ఏమిటి?" అని అడిగానని ఆమె చాలా చక్కని సమాధానం ఇచ్చిందన్నారు. విశాల దృక్పథం కలిగి, తమకు అన్నీ తెలియవని అంగీకరించే వారే విద్యార్థి అని ఆ అమ్మాయి చెప్పింది. 'ఇడియట్' అనే పదంపై అభిప్రాయం ఏంటని విద్యార్థులను అడిగినట్లు పేర్కొన్నారు. ఈ పదాన్ని ఆయన ఉపయోగించడం వివాదంగా మారింది. రాహుల్ ప్రసంగాన్ని కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. "రాహుల్ ఈ ప్రకటనను ఏ ప్రాతిపదికన చేశారు? మీరు క్షమాపణ చెప్పాలి. వారు విచారణకు డిమాండ్ చేస్తే, మేం అంగీకరిస్తాం. అఖిలేష్, మీరు చెబుతున్నది వేరు. రాహుల్ చెప్పింది తప్పు. నేరుగా ఆయన హోంమంత్రినే ప్రస్తావించారు. దేని ఆధారంగా ఇలాంటి ఆరోపణలు చేశారో చెప్పాలి. లేకుంటే రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి" అని అన్నారు.

# శంకుస్థాపనకే పరిమితమైన రూ.5.26 కోట్ల రహదారి

**ఏడాది గడిచినా పనులు మొదలుకా లేదు..**

**గుంతలమయమైన సింగూరు-ఆత్మకూరు లింక్ రోడ్డు**

**ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణిస్తున్న వాహనదారులు..**

**రీల్స్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న యువత**





సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి జూలై 30: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని సింగూరు–ఆత్మకూరు గ్రామాలను అనుసంధానించే మాలపాడు–బుసరెడ్డిపల్లి–మల్‌రెడ్డిపేట–బొబ్బిలి గ్రామాల లింక్ రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాలు కురవడంతో రహదారి అంతా భారీ గుంతలు, బురదతో నిండిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారిపై ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ దారి ఉందో గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాల నుంచి లారీలు, వ్యవసాయ వాహనాల వరకు ఈ మార్గంలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల గుంతల్లో వాహనాల టైర్లు పూర్తిగా మునిగిపోతుండగా, పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

**శంకుస్థాపనతోనే సరిపెట్టారా..?**

ఈ రహదారి నిర్మాణానికి 2025 మే 13న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా రూ.5.26 కోట్ల వ్యయంతో శంకుస్థాపన జరిగింది.
శిలాఫలకం ఏర్పాటు చేసి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైంది.

**అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు**

రహదారి దుస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారడంతో పాఠశాల విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**రీల్స్‌తో యువత వినూత్న నిరసన**

శిలాఫలకం వద్దకు వెళ్లి "ఈ రోడ్డు కోసం ఎవరిని అడగాలి?" అంటూ యువకులు సోషల్ మీడియాలో రీల్స్ రూపొందించి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రశ్నిస్తున్నారు.

**తక్షణమే పనులు ప్రారంభించాలన్న డిమాండ్**

ఈ రహదారి చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాన అనుసంధాన మార్గం కావడంతో వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శంకుస్థాపన లకే పరిమితం కాకుండా నిధులను వినియోగించి పనులు పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

**ఉప్పొంగి వంతెనల పై నుం డి పారిన వాగులు, వంకలు**

**వరదలకు నిండిన చెరువు లు**

**అనేక చోట్ల స్తంభించిన జన జీవనం, రాకపోకలు**

**వందలాది ఎకరాల్లో కొట్టు కుపోయిన పంటలు**

**పలు చోట్ల నిలిచిపో యిన విద్యుత్ సరఫరా**

**జలపాతాల వద్దకు జనం నిషేధం**

**అప్రమత్తత తో తప్పిన ప్ర మాదాలు**

ఆదిలాబాద్ బ్యూరో జులై 30,(ప్రజా జ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఒక్క సా రిగా ఉలిక్కి పడింది. గత మూడు రోజులుగా ఎడతెరి పి లేకుండా జిల్లాలో కురు స్తున్న వర్షం మధ్య మధ్యలో తేలికగా కురుస్తూనే ఒక్కో సారిగా దంచి కొడుతోంది. భంగాళఖా తంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వెల్ల గత మంగళవారం నుంచి ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాలో వి స్తారంగా వర్షం కురుస్తుంది. వాగులు, వంకలు ఉప్పొంగి



ప్రవహిం చడం వల్ల ఎటు చూసినా జనం స్తంభించి పో తుంది. గత రెండు రోజులు తేలికపాటి గా కురిసి బుధ వారం రాత్రి నుంచి గురువా రం ఉదయం వరకు దంచి కొట్టింది. దీంతో పలు చోట్ల కల్వర్టులు, వంతెనలు, రో డ్లు పై నుంచి వరద నీరు ఉ ప్పొంగి పొర్లి పారింది. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పో యింది. అనేక గ్రామాల్లో వి ద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు విరిగి పడినట్లు స మాచారం. వందలాది ఎక రాల్లో పంటలు కొట్టుకు పో యి,అనేక చోట్ల పంటలు నీ ట మునిగినట్లు తెలుస్తోంది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమ య్యాయి. జన జీవనం పూర్తిగా స్తంభించిం ది. అనేక గ్రామీణ ప్రాంతాల లో వరదలు బీభత్సం సృ ష్టించాయి. వాగులు, వంక లు ఉప్పొంగి పొర్లి పారాయి యి. తలమడుగు మండలం కోడద్, హస్నాపూర్ గ్రామా ల మధ్య ఉన్న ప్రధాన రహ దారిపై నుండి వాగు ఉప్పొం గి పారడంతో రాకపోకలు కొ ద్ది సేపు నిలిచిపోయాయి. దీంతో పాటుగా ఇచ్చోడ, సిరికొండ, బజార్ హత్నూర్, బోథ్, నేరడిగొండ, గుడిహ త్నూర్, ఇంద్రవెల్లి,నార్నూర్, తాంసి , జైనూర్,





ఉట్నూర్, జైనథ్, తలమడుగు, మండ లాల్లో, నిర్మల్ ఆసిఫాబాద్ మంచిర్యాల జిల్లాలో కూడా వాగులు ఉప్పొంగి పారడం తో ఆ గ్రామాలకు రాకపోక లు నిలిచిపోయాయి. కల్వ ర్టుల పైనుంచి వరద నీరు ఉ ప్పొంగి పారింది. ఈ ప్రాంత గల కు కూడా రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. వర్షాలు పడుతున్న దృష్ట్యా సిద్ధంగా ఉండాలని జిల్లా క లెక్టర్ తో పాటు ఉన్నతాధి కారులు స్థానిక ప్రజలను, అధికారుల ను అప్రమత్తం చేశారు. పలు గ్రామాల్లో తె ల్లవారుజాము నుంచే ఇళ్ల ల్లోకి నీరు చేరడం వల్ల సరు కులన్నీ నీటికి తడిసి ముద్ద య్యాయి.
ఆదిలాబాద్ జి ల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్ పేట్ లో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఈ సారి పెను ముప్పు త ప్పింది.సిరికొండ మండల కేంద్రం సమీపంలో ఉన్న కొం డాపూర్ వాగు పై వంతెన ఈ సంవత్సరం పూర్తి చే యడం వల్ల అక్కడ పెను ప్రమాదం తప్పింది. అయి నా కొత్తగా నిర్మించిన వంతె న పై నుంచి కూడా వరద నీ రు ఉప్పొంగి పారడం వల్ల అటు వైపు రాక పోకలు నిలిపివేశారు.గురు వారం తెల్ల వారు జాము నుంచి కురిసిన వర్షం వల్ల కొండా పూర్ బ్రిడ్జి పై నుంచి వరద నీరు పారింది. ఇదిలా ఉం డగా సిరికొండ మండలం లోని కుంటగూడా, తుమ్మల్ పాడు, ధర్మసాగర్, నారా యణపూర్, తదితర గ్రామా ల సమీపంలో ఈ సారి కొత్త కల్వర్టులు నిర్మించడం తో పెను ప్రమాదం తప్పింది. ఇ చ్చోడ, సిరికొండ, బజార్ హత్నూర్, బోథ్, ఇంద్రవెల్లి, నేరడిగొండ, గుడిహత్నూర్, జైనథ్, బేల,తాంసి, తలమ డుగు, నార్నూర్, బీంపూర్, గాది గూడ, ఉట్నూర్, తది తర మండలాల్లో సైతం వా గులు ఉప్పొంగి పొర్లాయి. దీంతో జలపాతాళ వద్దకు సందర్శకులను నిషేధం వి ధించారు.

## భారీ వర్షాలు, వరదలపై యంత్రాంగం అప్రమత్తం

**ముందస్తు చర్యలకు ఆదే శాలు**

**ప్రాణ రక్షణే లక్ష్యం**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 30, (ప్రజా జ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎ లాంటి ప్రాణనష్టం జరగకుం డా



"జీరో క్యాజువాలిటీ" ల క్ష్యంగా అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేసి ముంద స్తు చర్యలు చేపట్టాలని రా ష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శి సంజయ్ జాజు స్పష్టం చే శారు. గురువారం హైదరా బాద్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికా రులు, జిల్లా క లెక్టర్లతో నిర్వహించిన వీడి యో కాన్ఫరెన్స్‌లో వర్షాలు, వరద పరిస్థితులపై సమీక్షిం చి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధా న్యం ఇవ్వాలని పేర్కొన్న ప్ర ధాన కార్యదర్శి, అన్ని శాఖ ల అధికారులు 24 గంట లూ అప్రమత్తంగా ఉండి క్షే త్రస్థాయిలో పరిస్థితు లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్యారేజీలు, రి జర్వాయర్లు, కాలువలు, కా జ్‌వేలను ఎప్పటికప్పుడు ప రిశీలించి ప్రమాదాలు జరగ కుండా చర్యలు తీసుకోవాల ని సూచించారు.గోదావరి పరివాహక ప్రాంతాలు, గ తంలో వరద ముంపునకు గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర ద ప్రవాహాలను నిరంతరం ట్రాక్ చేస్తూ అవసరమైతే ప్రజలను ముందుగానే సు రక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా క్లోరిన్ ట్యాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకె ట్లు, అవసరమైన మందులు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సరఫరాకు అంత రాయం కలగకుండా ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయాల ని సూచించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకు ని అవసరమైతే పాఠశాలల కు సెలవులు ప్రకటించాలని పేర్కొన్నారు.ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, బో ట్లు, ఈతగాళ్లు, జేసీబీలు తదితర అత్యవసర వనరు లను ముందుగానే సిద్ధంగా ఉంచి ఎలాంటి పరిస్థితి నైనా సమర్థంగా ఎదుర్కొనే లా జిల్లా యంత్రాంగం సి ద్ధంగా ఉండాలని ఆదేశిం చారు.కలెక్టరేట్ వీడియో కా న్ఫరెన్స్ హాల్ నుంచి సమా వేశంలో పాల్గొన్న జిల్లా కలె క్టర్ రాజర్షి షా, జిల్లాలో కొన సాగుతున్న భారీ వర్షాలు, వరద పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందించారు.
జిల్లాలో నిన్న 64.6 మిల్లీ మీటర్లు, నేడు 51.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం న మోదైందని తెలిపారు. వా తావరణ శాఖ సూచనల మేరకు రానున్న 12 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగ నున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా చ ర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు.సాత్నాల ప్రాజెక్టు కు ప్రస్తుతం 6,476 క్యూసె క్కుల ఇన్‌ఫ్లో నమోదవు తుండగా పరిస్థితిని నిరం తరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మత్తడి వాగు ప్రా జెక్టుకు అధిక వరద ప్రవా హం వస్తుండటంతో ఐదు గే ట్లలో నాలుగు గేట్లు ఎత్తి నీ టిని దిగువకు విడుదల చే స్తున్నామని చెప్పారు. జిల్లా లో మొత్తం 67 లో-ల్యాండ్ కాజ్‌వేలు ఉండగా, వాటిలో 40 కాజ్‌వేలపై రాకపోకలు కొనసాగుతున్నాయి. మిగిలి న 27 కాజ్‌వేలపై నీరు ప్రవ హిస్తున్నందున ప్రజలు, వా హనాలు వాటిని దాటకుం డా పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా కట్టుది ట్టమైన చర్యలు చేపట్టాయని తెలి పారు. భారీ వర్షాల కారణం గా కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు, ప శువులు, కల్వర్టులు, రిటై నింగ్ వాల్స్ తదితర మౌలిక వసతులకు స్వల్ప నష్టం వా టిల్లిందని, నష్టాలను అంచ నా వేసి బాధితులకు తక్షణ సహాయం అందించే చర్యలు కొనసాగుతున్నా యని చెప్పారు. దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ ప నులు ప్రారంభించినట్లు తెలి పారు.చెరువులు, ప్రాజెక్టు లు, వాగులు, ట్యాంకుల నీ టి మట్టాలను క్లస్టర్లు, హెల్ప ర్లు, సంబంధిత శాఖల అధి కారులు నిరంతరం పర్యవే క్షిస్తున్నారని, అత్యవసర ప రిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచామని వివరిం చారు.ఖండాల, పొచ్చర, కుంటాల జలపాతాలు సహా అన్ని పర్యాటక ప్రాంతాలకు పర్యాటకుల ప్రవేశాన్ని అట వీ శాఖ సమన్వయంతో నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ఎటు వంటి ప్రాణనష్టం నమోదు కాలేదని, నీటిమునిగిన రెం డు మార్గాల్లో ట్రాఫిక్ ను ప్ర త్యామ్నాయ రహదారుల ద్వారా మళ్లించామని, ఎస్ డీఆర్ఎఫ్ బృందాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నా యని తెలిపారు.ఈ వీడి యో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ ఆర్. ఎస్ చిత్రు, జి ల్లా వ్యవసాయ శాఖ రవీం దర్, జిల్లా పంచాయతీ అధి కారి రమేష్, డి ఎం అండ్ ఎచ్ ఓ డా. సాధన, ఆర్ &బి ఈ ఈ రమేష్, పంచా యతీ రాజ్ ఈ ఈ శివరాం,
మున్సిపల్ కమిషనర్ జగ దీశ్వర్ గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యసభకు చేరిన ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

మొదటిపేజీ తరువాయి..

ప్రసక్తే లేదన్నారు. పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయడాన్ని అనుమతించ బోమన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత సంక్షేమాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని చెప్పారు. ఈ బిల్లును తీసుకురావడానికి ప్రధాని ఏ మాత్రం ఆలస్యం చేయలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. 'నీట్ పేపర్ లీక్ వల్ల చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పేపర్ లీక్ కాకుండా ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు. 2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదు? ఢిల్లీలో విద్యార్థుల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై అమిత్‌షా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ఘటనకు ఆయన బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి? అని మోదీ సర్కారును ఆయన నిలదీశారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని ఖర్గే అభివర్ణించారు. 2024లోనే ఈ బిల్లు ఎందుకు తీసుకురాలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు తప్ప విద్యార్థులపై ప్రేమ లేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. బిహార్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులపై తుపాకులు ఎక్కుబెట్టారని విమర్శించారు. ఆందోళన చేసిన యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు.
వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967